www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 22 | | 26-6-2026 | | గురువారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |




# కలిసొచ్చిన సీఎంలు

ఒకే వేదికపై ముగ్గురు ముఖ్యమంత్రులు

దశాబ్దాల అంతర్రాష్ట్ర జల వివాదాల పరిష్కారానికి తుంగభద్ర డ్యామ్ వేదికైంది. గతేడాది వరదలకు కొట్టుకుపోయిన క్రస్ట్ గేటు ఘటన నుంచి పాఠాలు నేర్చుకున్న ప్రభుత్వాలు.. 51 కోట్ల రూపాయలతో పటిష్టంగా నిర్మించిన 33 కొత్త గేట్లను అట్టహాసంగా ప్రారంభించాయి. ఒకే వేదికపై మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్‌తో పాటు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హాజరు కావడం.. మునిరాబాద్ వేదికగా జల సమస్యలపై వీరంతా కీలక చర్చలు జరపడం రాజకీయంగా తీవ్ర ప్రాధాన్యం సంతరించుకుంది.

*- ఉద్యమ కెరటం, హైదరాబాద్*

- తుంగభద్ర డ్యామ్‌కు 51 కోట్లతో 33 కొత్త క్రస్ట్ గేట్లు
- ప్రారంభించిన కేంద్ర మంత్రి పాటిల్, చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్
- మునిరాబాద్‌లో అంతర్రాష్ట్ర జల వివాదాలపై కీలక భేటీ
- హోసపేట భారీ బహిరంగ సభకు హాజరు

...వివరాలు 2లో

# ఉద్యోగులకు రూ.కోటి బీమా!

## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు

2

రవీంద్రభారతిలో పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి




# పంచాయితీలు వద్దు

## జల వివాదాలకు పరిష్కారాలే ముఖ్యం



- ఆర్డీఎస్‌లో మాకొచ్చేది 5 టీఎంసీలే
- కేంద్ర మంత్రి, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం
- తుంగభద్ర సభలో సీఎం రేవంత్ స్పష్టీకరణ

వివరాలు 2లో..

# ఉద్యోగులకు నగదు రహిత వైద్యం!



- ప్రత్యేక ట్రస్టు ద్వారా హెల్త్ కార్డుల మంజూరు
- దశాబ్దాల కల నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం
- ఒక్క రూపాయి భారం లేకుండా 1.25 కోట్ల ప్రమాద బీమా
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు
- రవీంద్రభారతి సభలో డిప్యూటీ సీఎం భట్టి

ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్న హెల్త్ కార్డుల సమస్యకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

వివరాలు 3లో..

# తీర్పు కాపీలు ఇవ్వండి!

- ఫిరాయింపుల కేసులో హైకోర్టు ఆదేశం
- కౌంటర్ దాఖలు చేయకపోవడంపై అసంతృప్తి

వివరాలు 3లో..



3

# కార్యకర్తల రక్షణ బాధ్యత నాదే!

- గతంలో జరిగిన పొరపాట్లు ఇక జరగవు
- 2028లో సీఎం కేసీఆర్.. ఆ తర్వాత బాధ్యత నాదే
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్
- రియల్ ఎస్టేట్‌ను పాతాళంలో పాతేసిన రేవంత్



వచ్చే ఎన్నికల్లో మళ్లీ మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, అప్పుడు కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్లే బాధ్యత తాను తీసుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. గతంలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లు మళ్లీ జరగనివ్వబోనని హామీ ఇచ్చారు. గురువారం వికారాబాద్ జిల్లా చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు.

వివరాలు 3లో..

# సుచరిత ఇంటిపై మళ్లీ ఏసీబీ పంజా!



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సోదాలు

భారీగా అక్రమాస్తులను గుర్తించిన అధికారులు

మే 26న లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్

3

# ఫీజు బకాయిలు ఎందుకివ్వట్లేదు?

- ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు
- ఆగస్టు 15 లోపు చెల్లిస్తామన్న ప్రభుత్వ న్యాయవాది
- జీవో నంబర్ 9పై మంగళవారం వరకు కోర్టు స్టే

వివరాలు 3లో..

# ఎస్ఐఆర్‌పై రాజకీయం వద్దు!

- ఇది పూర్తిగా చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ
- అపోహలు సృష్టించి గందరగోళానికి గురిచేయొద్దు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూటి ప్రశ్న

2



# సుప్రీంకు వెళ్లాల్సిందే!

- ప్రభుత్వం వేయకపోతే నిరుద్యోగులతో కలిసి మేమే వేస్తాం
- స్థానికతపై హైకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలన్న కవిత

3





# పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంపు

- 14 ఏళ్ల తర్వాత ఛార్జీల సవరణ
- వచ్చే నెల 1 నుంచి కొత్త రుసుము అమలు

4



4

# పరువు నష్టం కేసులో రాహుల్ విచారం


- మధ్యప్రదేశ్ హైకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు
- కార్తికేయను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని వివరణ

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ సింగ్ చౌహాన్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నారు. కార్తికేయ సింగ్‌పై చేసిన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు చేశారు.

# వెనిజువెలాను వణికించిన జంట భూకంపాలు

- 39 సెకన్ల వ్యవధిలో రెండు భారీ ప్రకంపనలు

4



ఉద్యమ కెరటం
శుక్రవారం 26 జూన్ 2026



# ఓటర్ల సవరణపై రాజకీయం వద్దు!

**ఇది పూర్తిగా చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ**

**రాజకీయ స్వార్థం కోసం దుష్ప్రచారం చేయడం తగదు**

**అపోహలు సృష్టించి గందరగోళానికి గురిచేయొద్దు**

**గత కాంగ్రెస్ హయాంలో ఇలాంటి సవరణలు జరగలేదా?**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూటి ప్రశ్న**

**హైదరాబాద్, జూన్ 25:** ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రాజకీయ కోణంలో చూడవద్దని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అది పూర్తిగా రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని గుర్తుచేశారు. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని పార్టీలు లేనిపోని అపోహలు సృష్టిస్తూ దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపకల్పనలో ప్రజలు కూడా చురుగ్గా భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ఎస్ఐఆర్ అనేది కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం దేశవ్యాప్తంగా జరిగే ఓ నిరంతర ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు నకిలీ, అక్రమ ఓట్లను తొలగించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశమని వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఈ సవరణలు చేపడుతున్నారని తెలిపారు.

**ఆ రంగు పులమడం వెనుక ఆంతర్యం ఏమిటి?**

ఓటర్ల జాబితా సవరణ అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత అవసరమైన చట్టబద్ధమైన ప్రక్రియ అని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. కానీ కొన్ని రాజకీయ పార్టీలు దీనిపై కావాలనే అపోహలు సృష్టిస్తూ.. ప్రజలను, అధికారులను గందరగోళానికి గురిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇలాంటి సవరణలు జరిగాయని.. ఇప్పుడు కేవలం రాజకీయ రంగు పులమడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకునేందుకు ప్రజలంతా ఈ సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఎక్సైజ్ శాఖలో భారీ బదిలీలు!

**పలువురు డీసీలకు స్థానచలనం.. కొత్త వారికి పోస్టింగులు**

**గ్రేటర్ హైదరాబాద్ డీసీగా శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 25:** రాష్ట్ర ఎక్సైజ్ శాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ జిల్లాల్లో డిప్యూటీ కమిషనర్లుగా (డీసీ) పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించగా.. మరికొందరికి కొత్త పోస్టింగులు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులు వెలువరించారు. ఎక్సైజ్ శాఖలో జరిగిన తాజా బదిలీల్లో భాగంగా నల్గొండ డీసీగా ఉన్న ఏ.శ్రీనివాస్ రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ డీసీగా నియమించారు. మెదక్ డీసీ జె.హరికిషన్‌కు సైబరాబాద్ డీసీగా పోస్టింగ్ ఇచ్చారు. ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సి.వి.శశిధర్ రెడ్డిని నల్గొండ డీసీగా పంపించారు. రంగారెడ్డి డీసీ దశరథ్‌ను టీజీబీసీఎల్ డీసీగా బదిలీ చేయగా, హెడ్‌క్వార్టర్స్ డీసీ కె.రఘురాంను రంగారెడ్డి డీసీగా నియమించారు. ఖమ్మం డీసీ జనార్దన్ రెడ్డికి ఆదిలాబాద్ డీసీగా బాధ్యతలు అప్పగించారు. నిజామాబాద్ ఏసీ వి.సోమిరెడ్డిని ఖమ్మం డీసీగా పంపించారు. ఏసీ లేబుల్స్ పి.శ్రీధర్‌ను నిజామాబాద్ డీసీగా నియమించారు. టీజీబీసీఎల్ ఆర్ఆర్-1 లో ఉన్న దాతురాజు గౌడ్‌కు వరంగల్ డీసీగా పోస్టింగ్ ఇచ్చారు. కరీంనగర్ బీసీఎల్ మేనేజర్‌గా ఉన్న రవికుమార్‌ను కరీంనగర్ డీసీగా నియమించారు. హైదరాబాద్ ఏసీ ఏ.అనిల్ కుమార్ రెడ్డిని ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏసీ పి.ప్రణవికి మల్కాజిగిరి డీసీగా బాధ్యతలు అప్పగించారు. మహబూబ్‌నగర్ ఏసీగా ఉన్న విజయ్ భాస్కర్ రెడ్డికి అక్కడే డీసీగా పదోన్నతి కల్పించారు. బ్రేవరీస్ ఏసీ చంద్రయ్యను మెదక్ డీసీగా నియమించారు. బదిలీ అయిన అధికారులంతా తక్షణమే కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని ప్రభుత్వం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది.

# పాలమూరుకు మరణశాసనమే!

**కర్ణాటక అక్రమ ప్రాజెక్టులతో చుక్క నీరు రాదు**

**ఆర్డీఎస్ వద్ద కొత్తగా లిఫ్టులు, బ్యారేజీల నిర్మాణం**

**రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఫైర్**

**మహబూబ్‌నగర్, జూన్ 25:** కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు మరణశాసనం ఖాయమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పాలమూరు ప్రాంతానికి భవిష్యత్తులో చుక్క నీరు కూడా రాదని ఆయన హెచ్చరించారు. కృష్ణా, తుంగభద్ర నదులపై ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ నిర్మాణాలతో రైతులు తీవ్ర భయాందోళనల్లో ఉన్నారని గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు హెలికాప్టర్‌లో వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆ అక్రమ ప్రాజెక్టులు కనిపించలేదా అని శ్రీనివాస్ గౌడ్ నిలదీశారు. ఆర్డీఎస్ కు కేవలం 100 మీటర్ల దూరంలోనే కర్ణాటక ప్రభుత్వం లిఫ్ట్ పనులు మొదలుపెట్టిందని, వీటితో పాటు మరో 2 రోడ్ కమ్ బ్యారేజీలు కడుతోందని ఆయన ఆరోపించారు. మరోవైపు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు గుండ్రేవుల వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారని వెల్లడించారు. ఈ అక్రమ ప్రాజెక్టులన్నీ పూర్తయితే తుంగభద్ర నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు రావడం శాశ్వతంగా ఆగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమ నిర్మాణాలు పూర్తయితే పాలమూరులో ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన స్పష్టం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే అక్కడికి వెళ్లి అక్రమ నిర్మాణాలను పరిశీలించాలని డిమాండ్ చేశారు.

# ఒకే వేదికపై ముగ్గురు సీఎంలు!

- తుంగభద్ర డ్యామ్‌కు 51 కోట్లతో 33 కొత్త క్రస్ట్ గేట్లు
- ప్రారంభించిన కేంద్ర మంత్రి పాటిల్, ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్
- మునిరాబాద్‌లో అంతర్రాష్ట్ర జల వివాదాలపై కీలక భేటీ
- హోసపేట భారీ బహిరంగ సభకు హాజరు



**బళ్లారి, జూన్ 25:** గతేడాది వరదలకు దెబ్బతిన్న తుంగభద్ర డ్యామ్ కొత్త కళ సంతరించుకుంది. నిపుణుల కమిటీ సూచనల మేరకు 51 కోట్లతో కొత్తగా ఏర్పాటు చేసిన 33 క్రస్ట్ గేట్లను మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఒకే వేదికపై మూడు రాష్ట్రాల సీఎంలు కలుసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2024 ఆగస్టులో వచ్చిన భారీ వరదలకు తుంగభద్ర ప్రాజెక్టు 19వ గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత డ్యామ్‌ను పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు 51 కోట్లతో 33 కొత్త స్పిల్ వే గేట్లను ఏర్పాటు చేశాయి. గురువారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో కలిసి ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్ వీటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

**జల వివాదాలపై చర్చలు..**

గేట్ల ప్రారంభోత్సవానికి ముందు కొప్పల్ జిల్లా మునిరాబాద్‌లోని ఆడిటోరియంలో మూడు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై వీరు చర్చించారు. ఈ సమావేశానికి తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ చేరుకోగా.. రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. నీటి సమస్యలపై కీలక చర్చల అనంతరం వీరంతా అక్కడినుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత విజయ నగర జిల్లా హోసపేటలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు.

# నీటి పంచాయితీలు వద్దు!

- జల వివాదాలకు పరిష్కారాలే ముఖ్యం
- ఆర్డీఎస్‌లో మాకొచ్చేది 5 టీఎంసీలే
- కేంద్ర మంత్రి, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం
- తుంగభద్ర సభలో సీఎం రేవంత్ స్పష్టీకరణ



**బళ్లారి, జూన్ 25:** తుంగభద్ర నది ఒడ్డున జరిగిన మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ.. దశాబ్దాల అంతర్రాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తమకు నీటి పంచాయితీలు వద్దని, రైతుల సమస్యలకు పరిష్కారాలే కావాలని ఆయన స్పష్టం చేశారు. తుంగభద్ర డ్యామ్ 33 కొత్త గేట్ల ప్రారంభోత్సవం అనంతరం మునిరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ఘట్టం చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 3 తరాల సమస్యలకు 33 గేట్ల పునరుద్ధరణతో పరిష్కారం లభించబోతోందని ఆనందం వ్యక్తం చేశారు. దీనివల్ల బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు ప్రాంతాల సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. తక్కువ మాట్లాడి, అత్యంత వేగంగా పనిచేయడం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ప్రత్యేకత అని.. ఆయన చొరవతో ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. నీటి సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్లే నదీ జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**పాలమూరుకు 10 టీఎంసీలు రావడం లేదు..**

రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ద్వారా పాలమూరుకు 15 టీఎంసీల నీటి వాటా ఉన్నప్పటికీ.. కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. దాదాపు 10 టీఎంసీల నీరు తమ వరకు రావడం లేదన్న విషయాన్ని కేంద్ర మంత్రి పాటిల్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లానన్నారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని గుర్తుచేశారు. ఈ సమస్యలన్నింటిపై మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఇప్పుడు ఒక కొలిక్కి వచ్చాయన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర మంత్రితో ప్రత్యేకంగా చర్చించామని తెలిపారు.

**అందరి కష్టాలు తెలిసిన నేత చంద్రబాబు..**

కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసని రేవంత్ చెప్పారు. రైతులందరి కష్టాలు, ప్రాంతాల సమస్యలు తెలిసిన సీనియర్ నాయకుడు చంద్రబాబు అని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడికతీత వ్యవహారంపై కూడా కేంద్ర మంత్రితో చర్చించినట్లు వెల్లడించారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతర్రాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాది మంది రైతుల ప్రయోజనాల కోసం నీటి పంచాయితీలను పక్కనబెట్టి.. అందరం కలిసికట్టుగా అడుగులు వేద్దామని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఉద్యోగులకు రూ.కోటి బీమా!

- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు
- రవీంద్రభారతిలో పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- పన్నులు ఎగవేసే వారిని పట్టుకుని వసూలు చేయాలి
- అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు




**హైదరాబాద్, జూన్ 25:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కోటి రూపాయల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడంలో ఉద్యోగులదే కీలకపాత్ర అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. వారి భద్రత, కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ బీమా నిర్ణయం తీసుకున్నామన్నారు. తొలుత సింగరేణిలో ఈ పథకాన్ని ప్రారంభించామని.. ఇప్పటికే 45 మంది కార్మికుల కుటుంబాలకు ఈ బీమా సాయం కింద కోటిన్నర చొప్పున చెల్లించినట్లు తెలిపారు. తాను కూడా మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినే అని, ఉద్యోగుల సమస్యలు తనకు బాగా తెలుసునన్నారు. తాను దొరను కాదని, ప్రజల మధ్య నుంచి ఎదిగిన వ్యక్తినని ఆయన గుర్తుచేశారు.



**15 లక్షల మందికి లబ్ధి..**

గత పాలనలో ఉద్యోగులకు ప్రతి నెల 10వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జనవరి 1 నుంచి ప్రతి నెల 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని గుర్తుచేశారు. ఈ కోటిన్నర బీమా పథకం అమలులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషి ఎంతో ఉందన్నారు. బ్యాంకర్లను ఒప్పించి బీమా కల్పిస్తున్నామని.. దీనివల్ల పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందితో కలుపుకుని రాష్ట్రంలో 15 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. విమాన ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగులకు 3 కోట్ల బీమా కల్పిస్తున్నామని ప్రకటించారు.

**రోజుకో గంట అదనంగా పనిచేయాలి..**

రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు నడుం బిగించాలని, రోజూ ఒక గంట అదనంగా పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. పన్నులు ఎగవేసే వారిని గుర్తించి కఠినంగా వసూలు చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని ఆదేశించారు. గత పాలకులు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక కేంద్రంతో మాట్లాడి 11 శాతంగా ఉన్న వడ్డీ రేట్లను 7.5 శాతానికి తగ్గించగలిగామన్నారు.

**కట్టెలు పెడుతున్నారు..**

రాష్ట్రంలో తాము చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం మండిపడ్డారు. మూసీ నది పునరుజ్జీవనం, రీజనల్ రింగు రోడ్డు, మెట్రో విస్తరణ లాంటి పనులు చేస్తుంటే.. అడుగడుగునా అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఓట్లు వేయని ప్రజలు ఉంటే ఏంది, పోతే ఏంది అనే రీతిలో బీఆర్ఎస్ నేతలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు.

# కార్యకర్తల రక్షణ బాధ్యత నాదే!

- గతంలో జరిగిన పొరపాట్లు ఇక జరగవు
- 2028లో సీఎం కేసీఆర్.. ఆ తర్వాత బాధ్యత నాదే
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్
- రియల్ ఎస్టేట్‌ను పాతాళంలో పాతేసిన రేవంత్

**వికారాబాద్, జూన్ 25:** వచ్చే ఎన్నికల్లో మళ్లీ మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, అప్పుడు కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్లే బాధ్యత తాను తీసుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. గతంలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లు మళ్లీ జరగనివ్వబోనని హామీ ఇచ్చారు. గురువారం వికారాబాద్ జిల్లా చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. పార్టీ కేడర్‌కు భవిష్యత్తుపై గట్టి భరోసా ఇచ్చారు. "2028లో మీ అందరి దయతో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. ఆ తర్వాత బాధ్యత నేను తీసుకుంటాను. మీకు రావాల్సిన పదవులు, దక్కాల్సిన గౌరవం తీసుకొచ్చే బాధ్యత నాది. గత పదేళ్ల పాలనలో చిన్నచిన్న పొరపాట్లు జరిగి ఉండొచ్చు. ఉద్యమంలో పనిచేసిన బిడ్డలకు అన్యాయం జరిగిందనే భావన ఉండొచ్చు. వాటన్నింటినీ మర్చిపోవాలని ప్రార్థిస్తున్నాను. ఇకముందు అలాంటి పొరపాట్లు జరగనివ్వనని మాట ఇస్తున్నాను" అని కేటీఆర్ పేర్కొన్నారు. కొత్త రాష్ట్రం కావడంతో పాలనపైనే ఎక్కువ దృష్టి పెట్టామని, పార్టీపై ఆశించిన స్థాయిలో ఫోకస్ చేయలేకపోయామని ఆయన వివరించారు.



### ఆ ఐడీ కార్డు జేబులో ఉంటే..

శాంతి సమయంలో సైనికుడు ఎంత చెమటోడిస్తే.. యుద్ధంలో అంత తక్కువ రక్తం కారుతుందని కేటీఆర్ సూచించారు. ఇప్పుడు పార్టీని బలోపేతం చేసుకుంటే రేపు ఎన్నికల సమయంలో ఎలాంటి ఆందోళన ఉండదన్నారు. "మీకు ఒక గుర్తింపు కార్డు ఇస్తాం. రేపు మన ప్రభుత్వం వచ్చాక ఆ కార్డు జేబులో పెట్టుకుని వెళ్తే.. ఏ ఆఫీసర్ అయినా, పోలీసు అయినా సరే.. 'కేసీఆర్ మనిషి వచ్చాడు' అని గౌరవించి పని చేసే పరిస్థితి ఉంటుంది" అని కార్యకర్తలకు ధైర్యం నూరిపోశారు. మనకు అధికారం, ఎమ్మెల్యేలు, ఎంపీలు లేకపోయినా.. ఇంత భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరావడం కాంగ్రెస్, బీజేపీ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోందని ఉత్సాహపరిచారు.

### రియల్ ఎస్టేట్ దివాళా తీసింది..

రియల్ ఎస్టేట్ అంటేనే తానని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఆ రంగాన్ని వంద అడుగుల లోతులో పాతేసిండని కేటీఆర్ మండిపడ్డారు. "గత కేసీఆర్ ప్రభుత్వంలో షాబాద్, చందన్ వెల్లి, సీతారాంపూర్ ప్రాంతాల్లో దిగ్గజ కంపెనీలు తీసుకొచ్చాం. ఆ దెబ్బకు అక్కడ ఎకరం 30 లక్షల నుంచి 3 కోట్లకు చేరింది. కానీ రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత కోటి రూపాయలు పలికిన భూమిని కనీసం 50 లక్షలకు కూడా ఎవరూ కొనడం లేదు. రియల్ ఎస్టేట్ పూర్తిగా కుప్పకూలడంతో లక్షలాది మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ఎందుకీ దారుణ పరిస్థితి వచ్చిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి" అని ఆయన కోరారు.

# ఉద్యోగులకు నగదు రహిత వైద్యం!

- ప్రత్యేక ట్రస్టు ద్వారా హెల్త్ కార్డుల మంజూరు
- దశాబ్దాల కల నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం
- ఒక్క రూపాయి భారం లేకుండా 1.25 కోట్ల ప్రమాద బీమా
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు
- రవీంద్రభారతి సభలో డిప్యూటీ సీఎం కీలక ప్రకటన

**హైదరాబాద్, జూన్ 25:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న హెల్త్ కార్డుల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. ప్రత్యేక ట్రస్టు ఏర్పాటు చేసి.. ఉద్యోగులందరికీ పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సేవలు అందించాలని రాష్ట్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీనికి తోడు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించే పనిలేకుండా ఏకంగా 1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమాను కూడా ప్రభుత్వం ప్రకటించింది. రవీంద్రభారతిలో సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం ఈ ఉచిత బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్న హెల్త్ కార్డుల సమస్యకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందన్నారు. ఒక ప్రత్యేక ట్రస్టు ఏర్పాటు చేసి.. ప్రభుత్వ ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో 'క్యాష్ లెస్' (నగదు రహిత) వైద్య సేవలు అందించేలా కేబినెట్ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. దీనివల్ల ఉద్యోగుల ఆరోగ్య భద్రత మరింత మెరుగుపడుతుందనే భరోసా ఇచ్చారు.



### 1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా..

ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు దేశ చరిత్రలోనే తొలిసారిగా బంపర్ ఆఫర్ ప్రకటించామని భట్టి తెలిపారు. ప్రభుత్వంపై గానీ, ఉద్యోగులపై గానీ ఎలాంటి భారం పడకుండా బ్యాంకర్లతో మాట్లాడి 1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. విమాన ప్రమాదం జరిగితే 2 నుంచి 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందన్నారు. 18 నుంచి 60 ఏళ్ల వయసున్న వారికి 10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందని వివరించారు. రెగ్యులర్ సిబ్బందికే కాకుండా.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కూడా ఈ బీమా వర్తిస్తుందని శుభవార్త చెప్పారు. ప్రమాదవశాత్తూ శాశ్వత లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఆర్థిక అండ లభిస్తుందన్నారు.

### ఒకటో తేదీనే జీతాలు..

గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి గుర్తుచేశారు. ఈఎంఐలు కట్టలేక వారి సిబిల్ స్కోర్ దెబ్బతినేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ.. ఉద్యోగుల హక్కులను కాపాడాలనే ఉద్దేశంతో ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇస్తున్నామని చెప్పారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేందుకు ఉద్యోగులు, ప్రభుత్వం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నేతలు అజారుద్దీన్, వివేక్, సీఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# స్థానికతపై సుప్రీంకు వెళ్లాల్సిందే!

- హైకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలన్న కవిత
- ప్రభుత్వం వేయకపోతే నిరుద్యోగులతో కలిసి మేమే వేస్తాం
- గ్రూప్-1 నియామకాల్లో తెలంగాణ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం
- అధికారంలోకి రాగానే జ్యుడీషియల్ కమిటీతో రివ్యూ చేసి తీరుతాం

**హైదరాబాద్, జూన్ 25:** తెలంగాణ స్థానికత అంశంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే 15 రోజుల తర్వాత నిరుద్యోగులతో కలిసి తామే పిటిషన్ వేస్తామని హెచ్చరించారు. గ్రూప్-1 నియామకాల్లో స్థానికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, తాము అధికారంలోకి రాగానే జ్యుడీషియల్ కమిటీ వేసి ఈ నియామకాలను రివ్యూ చేస్తామని ఆమె స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో 'తెలంగాణ స్థానికత - సవాళ్లు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కవిత మాట్లాడుతూ.. స్థానికత విషయంలో 600 ఏళ్లుగా మన మీద దాడి జరుగుతూనే ఉందన్నారు. బహుమనీ రాజ్యం ఈ స్థానికత పోరాటం కారణంగానే 5 సామ్రాజ్యాలుగా విడిపోయిందని, అందులో 1 మన గోల్కొండ అని గుర్తుచేశారు. ఆ తర్వాత స్థానికుల హక్కులను కాపాడేందుకు అసఫ్ జాహీలు 1868 లో రూల్స్ తెచ్చారని, 1919 లో 15 ఏళ్ల స్థానికతతో ముల్కీ నిబంధనలు తీసుకొచ్చారని తెలిపారు. 1956 లో మనం ఆంధ్రప్రదేశ్‌లో విలీనం అయ్యాక ఆ గడువును 12 ఏళ్లకు, 1969 ఉద్యమం కారణంగా వచ్చిన 6 సూత్రాలతో 4 ఏళ్లకు కుదించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వంలో జై భారత్ కమిషన్ వేసి 50,000 కు పైగా ఉద్యోగాలు స్థానికేతరులకు వెళ్లాయని తేల్చినా.. 610 జీవో ద్వారా కూడా న్యాయం జరగలేదన్నారు. 2014 లో ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నా ఈ 12 ఏండ్లలో మనకు అన్యాయమే జరిగిందన్నారు.



### గ్రూప్-1 లో తీవ్ర అన్యాయం..

గ్రూప్-1 నియామకాల్లో 563 ఉద్యోగాలకు గాను నాన్ లోకల్ కింద 2 పోస్టులు మాత్రమే ఇవ్వాల్సి ఉండగా.. అక్రమంగా ఈడబ్ల్యూఎస్, బీసీ-డీ సర్టిఫికెట్లు ఇచ్చి 11 మందికి కట్టబెట్టారని కవిత ఆరోపించారు. ఆ 9 పోస్టులు మన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రావాల్సినవని మండిపడ్డారు. నిరుద్యోగులు సవాల్ చేస్తే ప్రభుత్వం ప్రజా ధనంతో పెద్ద లాయర్లను పెట్టి యువతపై దౌర్జన్యాలకు దిగుతోందని విమర్శించారు. మొత్తం మీద 200 మంది ఇతర రాష్ట్రాల వాళ్లే ఉండే ప్రమాదం ఉందన్నారు. రాజ్యాంగం ఇచ్చిన రక్షణను కాపాడాల్సిన జడ్జీలు ప్రెసిడెన్షియల్ ఆర్డర్ నంబర్ 7 లోని 3 రూల్స్‌ను కలిపి చూడటం సరికాదన్నారు. ఇప్పుడున్న పరిస్థితులు చూస్తుంటే మళ్లీ 15 ఏళ్ల ముల్కీ రూల్స్ రావాల్సిన అవసరం కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.

### జులై 2 న మిలియన్ మార్చ్..

స్థానికతపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయకపోతే మనకు మనమే అన్యాయం చేసుకున్నట్లవుతుందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ సంస్థలతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో 1 ఉద్యోగం కూడా రాలేదన్నారు. పైగా బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని ప్రభుత్వమే అమ్ముకుంటే స్టేట్ బ్యాంక్ వాళ్లు కేసు వేశారని, ఇలాంటప్పుడు పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. నీళ్ల విషయంలో కర్ణాటక వెళ్లి సీఎం మంగళహారతులు పడుతున్నారని, దీనివల్ల మన నీటి వాటా హక్కును కోల్పోతామని ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేస్తున్న అన్యాయాలను ప్రజలకు వివరిస్తామని, జులై 2 న ఉప్పల్ భగాయత్‌లో మరో మిలియన్ మార్చ్ నిర్వహిస్తామని కవిత వెల్లడించారు.



# తీర్పు కాపీలు ఇవ్వండి!

**ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో హైకోర్టు ఆదేశం**

**కౌంటర్ దాఖలు చేయకపోవడంపై అసంతృప్తి**

**స్పీకర్‌తో పాటు ఆ 10 మందికీ మళ్లీ నోటీసులు**

**తదుపరి విచారణ జూలై 22కు వాయిదా**

**హైదరాబాద్, జూన్ 25:** బీఆర్ఎస్ నుంచి పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు గురువారం కీలక విచారణ జరిపింది. ఈ వ్యవహారంలో స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను తమ ముందు ఉంచాలని ఆదేశించింది. గతంలో ఇచ్చిన నోటీసులకు ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. ఈ విచారణ సందర్భంగా.. అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ 10 మంది ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా తమ కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇంతకుముందు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అందరూ కచ్చితంగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ.. కేసు తదుపరి విచారణను జూలై 22కు వాయిదా వేసింది.

# ఫీజు బకాయిలు ఎందుకివ్వట్లేదు?

**ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు**

**బకాయిలివ్వకుండా ప్రైవేట్ కాలేజీలు ఎలా నడుపుతారు?**

**ఆగస్టు 15 లోపు చెల్లిస్తామన్న ప్రభుత్వ న్యాయవాది**

**జీవో నంబర్ 9పై మంగళవారం వరకు కోర్టు స్టే**

**హైదరాబాద్, జూన్ 25:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు గట్టిగా నిలదీసింది. బకాయిలు చెల్లించకుండా, విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దంటే ప్రైవేట్ యాజమాన్యాలు కళాశాలలను ఎలా నడుపుతాయని సూటిగా ప్రశ్నించింది. విద్యార్థుల నుంచి ఫీజుల వసూలును అడ్డుకుంటూ ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 9లోని కొన్ని నిబంధనలపై మంగళవారం వరకు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. ఫీజుల బకాయిల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఉద్దేశించి కోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని, పెండింగ్ బకాయిలను ఎప్పటిలోపు చెల్లిస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనికి ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ఆగస్టు 15లోపు బకాయిలన్నీ చెల్లిస్తామని న్యాయస్థానానికి బదులిచ్చారు. ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తే.. తమ పిటిషన్లను వెనక్కి తీసుకుంటామని ప్రైవేట్ కళాశాలల తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఇదే అంశంపై విద్యార్థులు కూడా కోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. అటు ప్రభుత్వం, ఇటు యాజమాన్యాల మధ్య విద్యార్థులు తీవ్రంగా నలిగిపోతున్నారని వారి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ ఫీజుల బకాయిల సమస్యతో విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును అభ్యర్థించారు. కాగా, ఈ వ్యవహారంపై మంగళవారం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ తమ వాదనలు వినిపిస్తారని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. కేసు తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# సుచరిత ఇంటిపై మళ్లీ ఏసీబీ పంజా!

**ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సోదాలు**

**భారీగా అక్రమాస్తులను గుర్తించిన అధికారులు**

**మే 26న లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్**



**హైదరాబాద్, జూన్ 25:** శామీర్‌పేట్ తహసీల్దార్ సుచరిత నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరోసారి సోదాలు చేపట్టారు. గత నెలలో లంచం కేసులో దొరికిన ఆమెకు.. ఆదాయానికి మించి భారీగా అక్రమాస్తులు ఉన్నాయనే సమాచారంతో ఈ ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక రైతులకు చెందిన 30 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు సుచరిత గతంలో 30 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా మే 26న తొలివిడత కింద 2 లక్షల సొమ్మును తన ప్రైవేట్ డ్రైవర్ ద్వారా తీసుకుంటుండగా ఆమె ఏసీబీకి అడ్డంగా పట్టుబడ్డారు. దీంతో అధికారులు సుచరితను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఆ విచారణ క్రమంలో సుచరితకు భారీగా ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. లంచం వ్యవహారంలో అరెస్టై రిమాండ్‌లో ఉన్న ఆమెపై.. తాజాగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగానే ఆమె ఇళ్లలో మరోమారు ముమ్మర సోదాలు కొనసాగిస్తున్నారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం 26 జూన్ 2026



# ఇరాన్‌తో ఆయిల్ డీల్‌కు మళ్లీ అవకాశం!

ప్రపంచం బాగుండాలంటే ముందు ట్రంప్ దూకుడుకు అక్కడి పార్లమెంట్ కళ్లెం వేయాలి. ఇరాన్‌పై ఇంకా ఆంక్షలు విధించడం, బెదిరించడం వంటివి చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఒక్క ట్రంప్ కారణంగా ప్రపంచం యావత్తూ అతాలకుతలం అయ్యింది. సునీమా వచ్చినంత పనయ్యింది. మళ్లీ కోలుకోవడమెలా అన్న సందిగ్ధంలో ప్రపంచ దేశాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక స్థితి దిగజారింది. ముఖ్యంగా భారత్ లాంటి అనేక దేశాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను తన మానాన తను బతికేలా చూడాలి. ట్రంప్ ఇక తన దేశ పురోగతికి సమయం కేటాయిస్తే చాలు. హర్మూజ్ తెరుచుకోవడం, చమురు ధరలు దిగిరావడం అన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా భారత్‌కు పెద్ద ఊరట అని చెప్పాలి. అలాగే భారత్ ఎవరి వద్ద చమురు కొనాలో వద్దో అన్నది అమెరికాకు సంబంధించిన వ్యవహారం కాదు. భారత్ ఎవరితో వాణిజ్యం చేయాలో చేస్తుంది. ఎవరితో చమురు డీల్ చేసుకోవాలో చేసుకుంటుంది. అంతేగానీ వేలుపెట్టాలని ఇక ట్రంప్ చేడడం మానుకోవాలి. ట్రంప్ తీరువల్ల అమెరికా ఇప్పటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. అక్కడా చమురు ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అక్కడున్న వారిని వెళ్లగొట్టే ప్రయత్నంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రణసంకటంగా మారాయి. ముఖ్యంగా భారతీయ టెక్కీలకు ఇదొక సమస్యగా మారింది. ఇకపోతే చమురు ధరలు దిగిరావడం, మళ్లీ హర్మోజ్ తెరుచుకోవడం తో ఇక స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం వచ్చింది. దీనిపై అటు ట్రంప్ కానీ, ఇటు ఇరాన్ కానీ పేచీలు లేకుండా చూసుకోవాలి. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో భారత్–ఇరాన్ మధ్య ఇంధన రంగంలో మళ్లీ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్‌నెజాద్ ఈ వారం భారత పెట్రోలియం మరియు సహజ వాయు మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్న నేపథ్యంలో, భారత్‌కు ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరాల భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో పరిమిత స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా ఆంక్షలకు ముందు భారత్‌కు ప్రధాన ముడి చమురు సరఫరాదారుల్లో ఇరాన్ ఒకటి. ముఖ్యంగా తక్కువ ధరలు, అనుకూల క్రెడిట్ సౌకర్యాలు, భారత రిఫైనరీలకు అనువైన నాణ్యత కారణంగా ఇరాన్ చమురుకు మంచి డిమాండ్ ఉండేది. భారత్–ఇరాన్ మధ్య జరగనున్న తాజా చర్చలు ఇంధన రంగంలో కొత్త అవకాశాలకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు పునరుద్ధరించబడేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, భవిష్యత్ కొనుగోళ్లు వాణిజ్య ప్రయోజనాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు మరియు ఆంక్షల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. 2015లో భారత్ సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో 6 శాతం వాటాను కలిగి ఉంది. 2016లో ఈ దిగుమతులు 14 ఎంఎంటీలకు చేరి వాటా 6.7 శాతానికి పెరిగింది. అయితే, 2017లో ఇరాన్ నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ఆ ఏడాది భారత్ 27 ఎంఎంటీల చమురును కొనుగోలు చేయగా, దేశ మొత్తం చమురు అవసరాల్లో ఇరాన్ వాటా 12.6 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట స్థాయి. 2018లో దిగుమతులు 23 ఎంఎంటీలకు తగ్గినా, ఇరాన్ వాటా 10.4 శాతంగా కొనసాగింది. 2019లో 24 ఎంఎంటీల దిగుమతులతో ఇరాన్ వాటా 10.6 శాతంగా నమోదైంది. అయితే 2019 మేలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసి, చమురు కొనుగోలు చేసే దేశాలకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపి వేయాల్సి వచ్చింది. ఈ ప్రభావం 2020లో స్పష్టంగా కనిపించింది. ఆ ఏడాది భారత్ కేవలం 2 ఎంఎంటీల చమురును మాత్రమే ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. దీంతో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 1 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఇటీవల నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్ఐఓసీ) భారత రిఫైనరీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి భవిష్యత్ చమురు సరఫరాలపై చర్చలు ప్రారంభించి నట్లు సమాచారం. అయితే భారత రిఫైనరీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలపై స్పష్టత, చెల్లింపు విధానాలు, షిప్పింగ్ మరియు బీమా సౌకర్యాలపై భరోసా లభించిన తర్వాతే పెద్ద ఎత్తున కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కెప్లర్ డేటా ప్రకారం, జూన్ నెలలో భారత్ రోజుకు సుమారు 73 వేల బ్యారెల్ల ఇరాన్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఏప్రిల్‌లో పరిమిత స్థాయిలో పునఃప్రారంభమైన సరఫరాలు క్రమంగా పెరుగుతున్నట్లు ఇది సూచిస్తోంది.

# వెనిజువెలాను వణికించిన జంట భూకంపాలు

- 39 సెకన్ల వ్యవధిలో రెండు భారీ ప్రకంపనలు
- భవనాలు కూలిపోవడంతో తీవ్ర విధ్వంసం.. అత్యవసర పరిస్థితి ప్రకటించిన ప్రభుత్వం



**కారకాస్, జూన్ 25:** వెనిజువెలాలో వరుసగా సంభవించిన రెండు శక్తివంతమైన భూకంపాలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కేవలం 39 సెకన్ల వ్యవధిలో రిక్టర్ స్కేలుపై 7.2, అనంతరం 7.5 తీవ్రతతో నమోదైన ప్రకంపనలతో రాజధాని కారకాస్‌తో పాటు కరీబియన్ తీర ప్రాంతాలు వణికిపోయాయి. భారీ భవనాలు, నివాస సముదాయాలు కూలిపోగా, ప్రాథమిక సమాచారం ప్రకారం 32 మంది మరణించగా, 700 మందికి పైగా గాయపడినట్లు వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం కారకాస్‌కు పశ్చిమాన సుమారు 168 కిలోమీటర్ల దూరంలోని మోరన్ సమీపంలో, 22 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం నమోదైంది. దాదాపు శతాబ్ద కాలం తర్వాత నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపంగా అధికారులు పేర్కొంటున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి. లా గువైరా, మోరన్, కారకాస్ పరిసర ప్రాంతాల్లో అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో టెర్మినల్ భవనం పైకప్పు దెబ్బతినడంతో విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను మూసివేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. భూకంపాల అనంతరం దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించిన తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు భవనాల్లోకి వెళ్లకుండా బహిరంగ ప్రదేశాల్లోనే ఉండాలని ప్రభుత్వం సూచించింది. అనంతర ప్రకంపనల ముప్పు ఇంకా కొనసాగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. భూకంపం సంభవించడానికి కొన్ని క్షణాల ముందే ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ ద్వారా పలువురు స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు హెచ్చరికలు అందినట్లు సోషల్ మీడియాలో స్క్రీన్‌షాట్లు వైరల్ అవుతున్నాయి. యాక్సిలరోమీటర్ సెన్సార్ ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ ప్రాథమిక భూకంప తరంగాలను గుర్తించి ముందస్తు హెచ్చరికలు పంపినట్లు టెక్నాలజీ నిపుణులు చెబుతున్నారు. వెనిజువెలాలో సంభవించిన ఈ ప్రకృతి విపత్తుపై ప్రపంచ దేశాలు సానుభూతి వ్యక్తం చేశాయి. బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సహాయక చర్యలకు అవసరమైన మద్దతు అందిస్తామని వెల్లడించారు.

## ఒకేరోజు పలు దేశాల్లో ప్రకంపనలు

కాలిఫోర్నియా, జపాన్, పుల్వామాలోనూ ప్రకంపనలు

వెనెజువెలా దేశం శతాబ్దకాలంలో ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తును చవిచూసింది. వెనువెంటనే రెండు శక్తిమంతమైన భూకంపాలతో ఉక్కిరిబిక్కిరైంది. తొలి భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదు కాగా, రెండోది మరింత తీవ్రత (7.5)తో వచ్చింది. అదే సమయంలో కొంచెం అటూఇటుగా అమెరికాలోని కాలిఫోర్నియాలో (5.6), జపాన్ (7.2)లోనూ భూకంపాలు వచ్చాయి. ప్రపంచంలో ఒకే రోజు ఇలా వేర్వేరు చోట్ల పుడమి ఉగ్రరూపం దాల్చడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ భూకంపాల మధ్య ఏమైనా సంబంధం ఉందా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే, దీనికి 'కాదు' అనే సమాధానం ఇస్తున్నారు కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన భూకంప శాస్త్రవేత్త డాక్టర్ లూసీ జోన్స్. ఈ భూకంపాలు వేర్వేరు ఫాల్ట్ సిస్టమ్స్ (ఫలకాలు కలిసే సరిహద్దులు, పగుళ్లు), ప్లేట్ బౌండరీల్లో సంభవించాయి. అంటే వాటి మధ్య సంబంధం లేదని అర్థం. ఒకదానిని మరొకటి ప్రేరేపించలేదు. ఒక చోట సంభవించే భారీ భూకంపాలు.. వేల మైళ్ల దూరంలో మరో భూకంపానికి దారితీసే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని జోన్స్ వెల్లడించారు. ఇలా ఒకే సమయంలో వేర్వేరు చోట్ల భూమి కంపించడం అనేది యాదృచ్ఛికమేనని చెబుతున్నారు. ఒక ప్రాంతంలో భూకంపం రావడమనేది అనూహ్యంగా జరిగే సంఘటన కాదు. కొన్ని దశాబ్దాలు, శతాబ్దాలుగా భూగర్భంలో ఒత్తిడి పేరుకుపోయి.. ఫలకాలు ఒకదానికొకటి రాసుకోవడం వల్ల ఇవి సంభవిస్తుంటాయి. అయితే భూకంపాలు సరిగ్గా ఎప్పుడు వస్తాయనేది అంచనా వేయడం అసాధ్యమే అయినా.. ఇలా ఒక్కసారిగా భూమి కంపించడం ఒక చక్రంలా జరిగే పక్రియేనని జోన్స్ పేర్కొన్నారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 3.5 తీవ్రతతో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో భూకంపాలు రాగా.. గురువారం తెల్లవారుజామున పుల్వామాలో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం నేపాల్‌లో 15 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక, జపాన్‌లో తొలుత భూకంప తీవ్రత 6.9 అని రాగా.. తర్వాత దానిని 7.2గా సవరించారు. చాలా తక్కువ వ్యవధిలో అంటే కొన్ని సెకన్ల నుంచి నిమిషాల తేడాతో దాదాపు ఒకే తీవ్రత గల రెండు భూకంపాలు ఒకే ప్రాంతంలో సంభవించడాన్ని 'ఎర్త్‌క్వేక్ డబ్లెట్' అంటారు. ఒకసారి భూకంపం వచ్చిన తర్వాత తక్కువ తీవ్రతతో చిన్న చిన్న ప్రకంపనలు రావడం సహజమే. కానీ డబ్లెట్ విషయానికొస్తే.. రెండోసారి వచ్చే భూకంపం కూడా దాదాపు మొదటిదానంత తీవ్రంగా ఉంటుంది. ఇప్పుడు వెనెజువెలాలో 39 సెకన్ల వ్యవధిలో వరుస భూకంపాలు వచ్చాయి. దీంతో ఇప్పుడు ఈ దేశ పరిస్థితిని శాస్త్రవేత్తలు 'ఎర్త్‌క్వేక్ డ్లబెట్'గా పిలుస్తున్నారు. వెనెజువెలాలో ఈస్థాయిలో భూకంపం 1900 సంవత్సరంలో వచ్చింది. అప్పుడు దాని తీవ్రత 7.7గా నమోదైంది. దాంతో రాజధాని సమీప ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. మళ్లీ 2018లో 7.3 తీవ్రతతో భూమి కంపించినప్పటికీ.. ఆస్తి, ప్రాణనష్టం ఇప్పటితో పోలిస్తే తక్కువగానే సంభవించింది.

# పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంపు

- 14 ఏళ్ల తర్వాత ఛార్జీల సవరణ
- వచ్చే నెల 1 నుంచి కొత్త రుసుము అమలు

న్యూఢిల్లీ, జూన్ 25: కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు ఫీజులను భారీగా పెంచింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత ఛార్జీలను సవరిస్తూ విదేశాంగ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త రుసుములు వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. 18 ఏళ్లు పైబడిన వారు కొత్తగా 36 పేజీల పాస్‌పోర్టు పొందేందుకు లేదా పునరుద్ధరణ (రీ––ఇష్యూ) కోసం ఇకపై రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఈ రుసుము రూ.1,500గా ఉండేది. అత్యవసర సేవ అయిన తత్కాల్ విధానంలో ఇదే పాస్‌పోర్టు కోసం ఫీజును రూ.3,500 నుంచి రూ.5,000కు పెంచారు. 60 పేజీల పాస్‌పోర్టు ఫీజును రూ.2,000 నుంచి రూ.3,500కు పెంచగా, తత్కాల్ విధానంలో ఈ పాస్‌పోర్టు కోసం రూ.6,000 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు రూ.4,000గా ఉండేది.

## పోగొట్టుకుంటే మరింత భారం

పాస్‌పోర్టు పోగొట్టుకున్న వారు కొత్తగా 36 పేజీల పాస్‌పోర్టు పొందాలంటే ఇకపై రూ.5,000 చెల్లించాల్సి ఉంటుంది. తత్కాల్ విధానంలో ఈ ఫీజు రూ.7,500గా నిర్ణయించారు. 60 పేజీల పాస్‌పోర్టు విషయంలో సాధారణ ఫీజు రూ.6,000 కాగా, తత్కాల్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే రూ.8,500 చెల్లించాల్సి ఉంటుంది. పాస్‌పోర్టు నిబంధనల్లో మార్పులు చేస్తూ విదేశాంగ శాఖ కొత్త ఫీజులను ప్రకటించింది. చివరిసారిగా 2012లో పాస్‌పోర్టు రుసుములను సవరించగా, ఇప్పుడు 14 ఏళ్ల తర్వాత మరోసారి ఫీజులను పెంచడం గమనార్హం.



# పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీ విచారం



- మధ్యప్రదేశ్ హైకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు
- కార్తికేయను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని వివరణ

**భోపాల్, జూన్ 25:** కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ సింగ్ చౌహాన్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నారు. కార్తికేయ సింగ్‌పై చేసిన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు చేశారు. తన వ్యాఖ్యలు కార్తికేయను ఉద్దేశించి చేసినవి కావని అందులో స్పష్టం చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ప్రమోద్ కుమార్ అగర్వాల్ విచారణ చేపట్టనున్నారు. 2018లో మధ్యప్రదేశ్‌లోని ఝాబువాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ పనామా పేపర్స్ అంశాన్ని ప్రస్తావిస్తూ కార్తికేయ సింగ్ పేరును ప్రస్తావించారు. తనపై ఆధారరహిత ఆరోపణలు చేసి పరువు నష్టం కలిగించారని ఆరోపిస్తూ కార్తికేయ భోపాల్‌లోని ఎంపీ–ఎమ్మెల్యే ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణకు హాజరుకావాలని ట్రయల్ కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. ట్రయల్ కోర్టు జారీ చేసిన సమన్లను, తనపై నమోదైన పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ రాహుల్ గాంధీ ఇప్పటికే మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తూ మరో పిటిషన్ దాఖలు చేశారు.రాహుల్ గాంధీ తాజా పిటిషన్‌పై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఆధారాలు లేకుండా వ్యాఖ్యలు చేసి తర్వాత విచారం వ్యక్తం చేయడం రాహుల్‌కు అలవాటైందని బీజేపీ ఐటీ సెల్ ఆరోపించింది. కార్తికేయ సింగ్ పేరును ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందని ప్రశ్నిస్తూ, ఇటువంటి వ్యాఖ్యలు ఆయన విశ్వసనీయతను దెబ్బతీస్తాయని విమర్శించింది.

# గోడౌన్ కూలిన ఘటనలో 8కి చేరిన మృతుల సంఖ్య

## కొనసాగుతున్న సహాయక చర్యలు..

**కోల్‌కతా, జూన్ 25:** మహానగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మరణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే.. మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన వెంటనే ఐదుగురు కార్మికులు మరణించగా.. 20 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే.


# ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఓటు హక్కు అత్యంత కీలకం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఏ-2 ఎరెడ్ల చంద్రశేఖర్ అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ, నమోదును పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలకు మద్దతుగా గురువారం వడూర్ గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ బాధ్యతను గుర్తించి ఓటరు జాబితాలో తమ పేర్లను సరిచూసుకోవాలని అన్నారు. ఏవైనా తప్పులు ఉంటే, కొత్తగా పేరు నమోదు చేసుకోవడానికి ఈ ప్రక్రియ ఒక మంచి అవకాశమని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కును పొంది గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతరం ఎరెడ్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ బీఎల్ఓతో కలిసి ఇంటింటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫార్మ్లను పంపిణీ చేస్తున్నామని, ఓటర్లందరూ ఈ ప్రక్రియకు సహకరించి, అధికారులకు కావాల్సిన వివరాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఓటర్లు గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవేపై కారు దగ్ధం

## స్వల్ప గాయాలతో ఏడుగురు యువకులు సురక్షితం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కారు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు యువకులు అప్రమత్తంగా బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. హైదరాబాద్ నుంచి ఎర్రవరం వైపు కారులో వెళ్తున్న ఏడుగురు యువకులు వేంసూరు సమీపానికి చేరుకోగానే కారు ముందు టైర్ ఒక్కసారిగా పేలింది. దీంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న రైలింగ్ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం అనంతరం కారులో మంటలు చెలరేగడంతో యువకులు వెంటనే అప్రమత్తమై బయటకు దూకారు. ఈ ప్రమాదంలో యువకులకు స్వల్ప గాయాలు కాగా, కారు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. స్థా నికులు, హైవే సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

# చెత్త వేరు చేయండి..

## గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచండి



**ఉద్యమ కెరటం, తాండూర్:** గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని కిష్టంపేట సర్పంచ్ సార్ల తిరుపతి అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామ పంచాయతీ 4వ వార్డులో గురువారం తాండూర్ మండల పంచాయతీ అధికారి జి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో చెత్త సేకరణ, వ్యర్థా ల నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎస్డబ్ల్యూఎం నిబంధనల ప్రకారం ఇంటి వద్దే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి సేకరించే విధానంపై గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తడి, పొడి చెత్త, శానిటరీ చెత్త, హానికర చెత్తలను వేర్వేరుగా ఉంచి గ్రామ పంచాయతీ ట్రాక్టర్కు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని తెలిపారు. వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ ద్వారా ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన గ్రామ వాతావరణాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మహాంకాళి కృష్ణమూర్తి, మేడి కవిత, కామెర ప్రణీత్ కుమార్, ఆత్రం ఉదయ్ కిరణ్, నాయకులు కామని శ్రీనివాస్, పట్టి పోశం, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ రామ్ ప్రసాద్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వార్డు వార్డు నా ప్రత్యేక డ్రైవ్..

- స్వచ్ఛ గ్రామంగా కొరారిని తీర్చిదిద్దుతాం
- సర్పంచ్ మాడవి శాంతబాయి



**ఉద్యమ కెరటం, కెరమెరి:** వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కొరారి గ్రామపంచాయతీ ముందస్తు చర్యలు చేపట్టింది. సర్పంచ్ మాడవి శాంతబాయి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్ చౌరస్తా ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా జేసీబీ సహాయంతో పూడికతీత పనులు నిర్వహించారు. కాలువల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు, నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా నూతనంగా మట్టి కాలువలను తవ్వించారు. పారిశుద్ధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ డ్రైనేజీ పూడికతీత పనులను పంచాయతీ వేగవంతం చేసింది. ఈ పనులను సర్పంచ్ మాడవి శాంతబాయి, పంచాయతీ కార్యదర్శి తిరిసుంగూలీ సతీష్తో కలిసి స్వయంగా పరిశీలించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, దోమలు వృద్ధి చెందకుండా పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాడవి శాంతబాయి మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఆరోగ్య, రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే ఈ ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి వార్డులోనూ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని, డ్రైనేజీలలో మరియు బహిరంగ ప్రదేశాలలో ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయవద్దని సూచించారు. గ్రామ పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతను కాపాడటంలో ప్రజలంతా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు.

# స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ వరప్రసాద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** స్వర్ణకారుల ఆర్థిక, సామాజిక సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా స్వర్ణకార కార్పొరేషన్ను ఏర్పాటు చేయాలని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ వరప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ కె హరిత, ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కోవలక్ష్మికు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి సరైన ఆదరణ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్వర్ణకారులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాగే స్వర్ణకారులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న 272 జీవోను తక్షణమే సవరించాలని కోరారు. వీటితో పాటు వృద్ధాప్యంలో ఉన్న స్వర్ణకారులకు అండగా నిలిచేందుకు 50 సంవత్సరాలు నిండిన ప్రతి సంఘ సభ్యునికి నెలకు 5,000 రూపాయల చొప్పున పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపాలని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ స్వర్ణకార సంఘం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరు మహేష్ చారి, నల్లగొండ తిరుపతి, కాగజ్నగర్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ గంగాధర్, వోజకే శవుల రవి, ముఖ్య నాయకులు శ్రీరామ్ పెంటయ్య, చిలుకూరి రవి, వంశీ, సురేష్, మొండయ్య, సంతోష్, హరిప్రసాద్, రాజు, తిరుపతి, భాస్కర్, శ్రీరామోజు శ్రీనివాస్, పూసాల రాజు, నల్లగొండ రవి, సత్యం, సందీప్, విజేందర్, రవీందర్ , సంఘాల జిల్లా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి జాబితాలో చేర్చాలి





- మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు , మున్సిపల్ సిబ్బంది బిఎల్ ఏలతో కలిసి దస్నాపూర్, హడుక్కో కాలనీలలో ఓటరు జాబితాలను ప్రారంభించి,ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. ఈ సంధర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలను పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా చూడాలని బీఎల్ఏలకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడికి ఆ హక్కు అందేలా రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, సాలం బిన్ అహ్మద్, బాలకృష్ణ, వార్డు ఆఫీసర్ మానుష , బీఆర్ఎస్ నాయకులు అశోక్, సాయి , బీఎల్ఏ లు లక్ష్మి, భాగ్యలక్ష్మి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సబ్ జైలులో 'యాంటీ డ్రగ్ అవేర్నెస్' పై ఖైదీలతో ప్రతిజ్ఞ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం , అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, జూన్ 22 నుండి 26 వరకు నిర్వహిస్తున్న "యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్" (మాదకద్రవ్యాల నిరోధక అవగాహన వారోత్సవాలు) లో భాగంగా గురువారం ఆసిఫాబాద్ ప్రత్యేక ఉప కారాగారంలో ఖైదీలు, సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.తెలంగాణ జైళ్ళ శాఖ ఆదేశాల మేరకు, మాదకద్రవ్యాల వాడకం, వాటి వల్ల కలిగే భయంకరమైన పర్యవసానాలపై రూపొందించిన ప్రత్యేక వాల్ పోస్టర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం జైలు సిబ్బంది, ఖైదీలు అందరూ కలిసి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, వాటి నిరోధానికి బాధ్యతాయుతంగా కృషి చేస్తామని "యాంటీ డ్రగ్ ఓత్" చేశారు. ఈ సందర్భంగా జైలు పర్యవేక్షణాధికారి జె. ప్రేమ్కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల మహమ్మారి వల్ల జీవితాలు ఎలా చిన్నాభిన్నం అవుతాయో వివరించారు. ఖైదీలలో పరివర్తన తీసుకురావడానికి, సమాజంలో అవగాహన పెంచడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

# ఓటరు జాబితాను పరిశీలించిన అదనపు కలెక్టర్



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా దామెర మండలంలో జరుగుతున్న ఓటరు నమోదు, పరిశీలన ప్రక్రియను అదనపు కలెక్టర్ గురువారం పరిశీలించారు. పరిశీలించారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాల సేకరణ, నమోదు విధానాన్ని పరిశీలించి బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గరిగె కల్పనా కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హులైన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా తమ వివరాలను సక్రమంగా అందించి కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ, తహశీల్దార్, డాక్టర్ మహేందర్, పంచాయతీ కార్యదర్శి మనోహర్, జీపీఓ సురేష్, వార్డు సభ్యులు నక్క రాజేందర్, ఇమ్మడి భారతి రజనీకర్, బీఎల్ఓలు రజిత, కోమల, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- డ్రగ్స్ వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేస్తుంది
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మాదకద్రవ్యాల ముప్పు నుంచి యువతను రక్షించేందుకు సమాజంలోని ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. గురువారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ పరివర్తన్ – నషా ముక్త్ భారత్ సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన అవగాహన కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూషతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరం వరకు నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో యువత, విద్యార్థులు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ప్రజలను చైతన్యపర్చారు. ఆదిలాబాద్ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ డ్రగ్స్ వ్యసనానికి బానిసైతే వ్యక్తిగత జీవితమే కాకుండా కుటుంబాల భవిష్యత్తు కూడా చీకటిలోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు సమాజానికి నక్సలిజం పెద్ద సవాలుగా ఉండగా, ప్రస్తుతం డ్రగ్స్ మహమ్మారి మరింత ప్రమాదకర రూపంలో విస్తరిస్తోందని డీజీపీ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. డ్రగ్స్ బారిన పడిన వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి 'డవ్' స్వచ్ఛంద సంస్థ సహకారంతో పాటు రిమ్స్ ఆసుపత్రిలో డీ–అడిక్షన్ కేంద్రాల ద్వారా సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యసనానికి గురైన వారిని చిన్నచూపు చూడకుండా వారిలో మార్పు తీసుకురావడానికి కుటుంబ సభ్యులు, సమాజం సహకరించాలని సూచించారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన వారిపై ప్రభుత్వం కఠిన వైఖరి అవలంభిస్తోందని స్పష్టం చేశారు. అలాంటి వ్యక్తులకు రైతు భరోసా, రుణమాఫీ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిలిపివేస్తామని, ఇప్పటికే కొందరు నిందితులపై ఈ చర్యలు అమలు చేసినట్లు వివరించారు. జిల్లాలో గ్రామ స్థాయి నుంచి డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ప్రతి గ్రామంలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రతి గురువారం డ్రగ్స్ వ్యతిరేక అవగాహన దినంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో చైతన్యం కల్పిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనించాలని, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసు, సంక్షేమ శాఖల సహకారంతో కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు. అనంతరం నషా ముక్త్ భారత్ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, అవగాహన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే డవ్ పునరావాస కేంద్రం ద్వారా మార్పు పొంది సాధారణ జీవితంలోకి వచ్చిన బాధితుల కుటుంబాలను ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సాధన, కౌన్సిలర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, యువత, విద్యార్థులు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# కమ్యూనిస్టుల ఐక్యతకు నిరంతర కృషి చేస్తున్నాం

- 29న వరంగల్లో ఎంసీపీఐ(యు) రాష్ట్ర ఏకీకరణ నిర్మాణ సదస్సు
- ఎంసీపీఐ(యు)రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి




**ఉద్యమ కెరటం, వరంగల్:** కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతం, పార్టీ ఏకీకరణ లక్ష్యంగా ఎంసీపీఐ(యు) రాష్ట్ర ఏకీకరణ నిర్మాణ సదస్సు ఈనెల 29న వరంగల్ నగరంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. పార్టీలో గతంలో తలెత్తిన విభేదాల కారణంగా విడివిడిగా కొనసాగుతున్న కమిటీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్యంగా ముందుకు సాగేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గురువారం వరంగల్ జిల్లా కార్యాలయం ఓంకార్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమ సమాజ స్థాపన కోసం పోరాడాల్సిన కమ్యూనిస్టు శక్తులు వివిధ కారణాలతో చీలిపోవడంతో పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద శక్తులు మరింత బలపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టుల ఐక్యత కాలానుగుణ అవసరమని, ఆ దిశగా ఎంసీపీఐ(యు) నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. దేశ స్థాయిలో పార్టీ ఏకీకరణకు సానుకూల వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో రాష్ట్రంలోనూ అదే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఈ క్రమంలో 29న వరంగల్ నగరంలోని అల్పాహారం కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఏకీకరణ నిర్మాణ సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జిల్లా కమిటీ సభ్యులు, ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా ఉద్యమాలను విస్తృతం చేసేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ ఆశయ సాధన కోసం వివిధ కమ్యూనిస్టు పార్టీలతో ఐక్యత చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, పాలకులు ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్ర సదస్సులో భవిష్యత్ కార్యాచరణపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ నాయకులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, మోర్తాల చందర్ రావు, గోనె కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.రెడ్డి హంసారెడ్డి , జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, కన్నం వెంకన్న, మంద రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు వంగల రాగసుధ, నర్ర ప్రతాప్, కర్ర రాజిరెడ్డి, గడ్డం నాగార్జున, నీల రవి, మాస్ సావిత్రి, మాలోతు రాజేష్ నాయక్, నగర కార్యదర్శి మాలోత్ సాగర్, సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్, జిల్లా నాయకులు ముక్కెర రామస్వామి, బాషిపాక రమేష్, అప్పనపురి నర్సయ్య, మాలి ప్రభాకర్, మహమ్మద్ హుస్సేన్, మంద భద్రయ్య, కూసం బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్
- బీఎల్ఓలకు 'సర్' కార్యక్రమంపై అవగాహన





**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ఓటరు జాబితా సవరణలో బీఎల్ఓలు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణలు అన్నారు. సత్తుపల్లి పట్ట ణం, మండల స్థాయిలో నిర్వహిస్తున్న 'సర్' కార్యక్రమంపై బీఎల్ఓలకు అవగాహన కల్పించే సమావేశం గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై బీఎల్ఓలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి బీఎల్ఓకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ముఖ్యంగా మ్యాపింగ్ ఫారాల పరిశీలనలో అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు సరైన సమాచారం అందిస్తూ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడంలో బీఎల్ఓల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈనెల 30న నిర్వహించనున్న ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున బీఎల్ఓలు పాటించాల్సిన విధానాలు, బాధ్యతలపై వివరించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దిబ్బల సౌజన్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో నెరవేరిన అంధుడి సొంతింటి కల

- బిక్షపతి ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఝాన్సీ రాణి



**ఉద్యమ కెరటం, హుజూరాబాద్:**

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన దృష్టి లోపం కలిగిన ఎతిపతి బిక్షపతి సొంతింటి కల సాకారమైంది. హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ఓడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు బిక్షపతి నూతన ఇందిరమ్మ ఇంటిని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ తౌటం ఝాన్సీ రాణి గురువారం ప్రారంభించారు. చదువులో ప్రతిభ కనబర్చిన బిక్షపతి పదో తరగతి చదువుతున్న సమయంలో చూపును పూర్తిగా కోల్పోయాడు. ఆర్థిక ఇబ్బందులతో శిథిలావస్థలో ఉన్న ఇంటిలో నివసిస్తున్న ఆయన పరిస్థితిని గమనించిన ప్రణవ్ బాబు స్వయంగా ఇంటిని సందర్శించి, జిల్లా కలెక్టర్తో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించారని తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తికావడంతో బిక్షపతి కుటుంబం సొంత గృహంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ "కంటిచూపు లేకపోయినా నాకు ఓ నీడను కల్పించిన కాంగ్రెస్ పార్టీకి, ప్రణవ్ బాబుకు జీవితాంతం రుణపడి ఉంటాను" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం ఝాన్సీ రాణి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపే కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాట్ల రమేష్, మార్కెట్ డైరెక్టర్ సముద్రాల కృష్ణ, గూడెపు మొగిలయ్య, ఆన్కార్ అశోక్, పుల్ల శోభన్, జన్ను వేణు, పెరుమాండ్ల పరశురాములు, మస్నా చంద్రశేఖర్, మౌటం చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డ పెళ్లి కి యూత్ కాంగ్రెస్ నాయకుడి సహాయం



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గురువారం వివాహం జరుగుతున్నటువంటి పేదింటి ఆడబిడ్డకి యూత్ కాంగ్రెస్ తాండూర్ మండల అధ్యక్షులు పట్టెం విష్ణు కళ్యాణ్ తనవంతు సహాయంగా ఎయిర్ కూలర్ అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు ఎండి ఈసా, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి 7వ వార్డు సభ్యులు ఎండి జుబేర్, తాండూర్ టౌన్ ప్రెసిడెంట్ 9వ వార్డ్ సభ్యులు సింగారవ్ శ్రీధర్, నాయకులు సింగరావ్ రఘు, పుప్పాల తిరుపతి, పెద్దబోయిన రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల వివరాలను క్షుణ్ణ ంగా పరిశీలించాలి

**ఎస్ఐఆర్ ఓటర్ ప్రక్రియను పరిశీలించిన తహశీల్దార్**



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రత్యేక సమగ్ర సవరణ ఇంటింటి సర్వేలో భాగంగా ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న అన్నారు. మండలంలో గురువారం ప్రారంభమైన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారులు రేచిని, తాండూర్, చౌటపల్లి గ్రామాల్లో చేపడుతున్న ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటరు జాబితాల ప్రక్షాళనలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ వెంట ఆర్ఐ టి.మురళీధర్ రావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీపద్మ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల తో నిరుపేదలకు భరోసా

- డబ్బా గ్రామంలో ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ దండే విఠల్



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదలకు ప్రభుత్వం భరోసానిస్తుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. చింతలమనేపల్లి మండలం డబ్బా గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ గృహాన్ని గురువారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు బోర్లే లలిత మెంగజి నూతన గృహాన్ని రిబ్బెన్ కట్ చేసి ప్రారంభించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పాడి రైతుల అభివృద్ధికి సహకార సంఘాలే బలం

**ఉద్యమ కెరటం,బిక్కనూరు:**

పాడి రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించి పాల ఉత్పత్తిని పెంచుకోవాలని తెలంగాణ సహకార యూనియన్ ప్రిన్సిపల్ భూక్య వెంకన్న సూచించారు. గురువారం బిక్కనూరు పాలకేంద్రంలో నిర్వహించిన పాల ఉత్పత్తిదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ద్వారా రైతులకు లభించే ప్రయోజనాలు, పశుసంవర్ధక రంగంలో తాజా మార్పులు, పాల నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించారు. సహకార సంఘాల బలోపేతంతో పాడి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.కార్యక్రమంలో బిక్కనూరు బీఎంసీయూ అధ్యక్షుడు ఏనుగు లోహిత్ రెడ్డి, విజయ డెయిరీ కామారెడ్డి మేనేజర్ వైష్ణవి పాల్గొని రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.ఈ సందర్భంగా పాలకేంద్రం అధ్యక్షుడు బత్తుల రాజు, ఉపాధ్యక్షుడు బచ్చగారి సిద్ధరాములు, ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు బండి స్వామి, బుచ్చముల బాలరాజు, పాపన్నగారి రాజుతో పాటు పలువురు పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

**కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్**



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పిలుపునిచ్చారు. గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొడసం దౌలత్రావు గురువారం ఆడే గజేందర్ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దౌలత్రావు ఆడే గజేందర్కు శాలువా కప్పి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆడే గజేందర్ నూతన మండల అధ్యక్షుడు తొడసం దౌలత్రావుకు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నాయకులు, కార్యకర్తలను సమన్వయంతో ముందుకు నడిపించాలని సూచించారు. ముఖ్యంగా ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ పార్టీపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మండలంలో పార్టీ జెండాను మరింత ఎత్తులో ఎగురవేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**ఇచ్చోడలో ఇందిరమ్మ గృహప్రవేశంలో ఆడే గజేందర్**



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన నూతన గృహానికి గురువారం గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులు శ్యామల–గంగయ్య దంపతుల నూతన ఇంటి గృహప్రవేశ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక సర్పంచ్ జలై జాకుతో కలిసి ఆడే గజేందర్ రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు. అనంతరం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ప్రతి కుటుంబం గౌరవప్రదమైన జీవనం సాగించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్యెం నారాయణ రెడ్డి, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, కోకస్మన్నూర్ సర్పంచ్ షామిమ్ యూసఫ్, మైనారిటీ సెల్ నియోజకవర్గ చైర్మన్ ముస్తఫా, ఎస్సీ సెల్ నియోజకవర్గ చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్, ముఖ్య నాయకులు బుక రాములు, మురళి గౌడ్, మధుకర్, సురేష్, జహీర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తలసేమియా వ్యాధిగ్రస్తులకు విద్యా రాయితీలు కల్పించాలి

- **తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్**



**ఉద్యమ కెరటం, మందమర్రి:** తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక విద్యా రాయితీలు కల్పించి ఉచిత విద్యను అమలు చేయాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్పీడబ్ల్యూడీ చట్టం-2016 విద్యా హక్కు చట్టం ప్రకారం రాష్ట్రంలో గుర్తింపు పొందిన 21 రకాల వ్యాధుల జాబితాలో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ వ్యాధులతో బాధపడుతున్న పిల్లలందరికీ ఉచిత విద్య అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా హక్కు చట్ట ంలోని 12(1)(సి) నిబంధన మేరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్త విద్యార్థులకు కేటాయించి ఉచిత విద్య అందించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాధి చికిత్సతో పాటు విద్యా భారం కూడా కుటుంబాలపై పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు.

# ఓటర్ల జాబితా ప్రక్షాళనకు 'ఎస్ఐఆర్' శ్రీకారం

- **ఈనెల 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికీ బీఎల్ఓల సందర్శన**
- **అపోహలు నమ్మొద్దు.. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించరు**
- **జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను సవరించి పారదర్శకమైన, తప్పుల్లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ గురువారం నుంచి జిల్లాలో అధికారికంగా ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఈనెల 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో కలెక్టర్ స్వయంగా తన ఓటరు వివరాలను పరిశీలించుకున్నారు. క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓను పిలిపించి రీప్రింటెడ్ ఎన్యుమరేషన్ ఫారమ్ ద్వారా తన వివరాలను ధృవీకరించారు. అనంతరం సంబంధిత వివరాలను నమోదు చేసి, ఫొటో జతచేసి బీఎల్ఓకు అందజేశారు. బీఎల్ఓ వెంటనే వాటిని బీఎల్ఓ యాప్లో నమోదు చేసి ధృవీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం తన ఓటు ఆదిలాబాద్లో ఉన్నప్పటికీ 2002 నాటికి ఇక్కడ లేదని, అప్పట్లో తన తండ్రి ఓటు బీహార్ రాష్ట్రంలోని అరరియా జిల్లా, ఫార్బిస్గంజ్ నియోజకవర్గంలో ఉండేదని తెలిపారు. గతంలోనే ఆ వివరాల మ్యాపింగ్ పూర్తయినందున ప్రస్తుతం అదే వివరాలను ఫారమ్లో నమోదు చేసినట్లు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కొన్ని వర్గాల్లో అపోహలు వ్యాప్తి చెందుతున్నాయని, ముఖ్యంగా తల్లిదండ్రుల ఓట్లు ఇతర రాష్ట్రాల్లో, లేనియెడల జిల్లాల్లో ఉంటే తమ ఓటు తొలగిస్తారనే భయాలు అవసరం లేదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన నిజమైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని హామీ ఇచ్చారు. జూలై 24 వరకు ఎన్యుమరేషన్ ఫారమ్ల సేకరణ కొనసాగుతుందని, అనంతరం వాటి పరిశీలన చేపట్టి జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా (డ్రాఫ్ట్ రోల్) విడుదల చేస్తామని తెలిపారు. ఫారమ్లలో నమోదు చేసిన వివరాల ఆధారంగా ఓటర్ల జాబితా సిద్ధం చేయబడుతుందని చెప్పారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఓట్ల తొలగింపుకు సంబంధించిన వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారమ్ను నింపి తమ వివరాలతో పాటు తల్లిదండ్రులు, తాతయ్య, నానమ్మ, గార్డియన్కు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని కోరారు. నింపిన ఫారమ్లో ఒక ప్రతిని ఓటరు వద్ద భద్రపర్చుకోవాలని, మరో ప్రతిని బీఎల్ఓకు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాంధీభవన్లో ఆదివాసి కాంగ్రెస్ సన్నాహక భేటీ

- **విక్రాంత్ భూరియాను సన్మానించిన డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్**
- **హాజరైన మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** హైదరాబాద్లోని గాంధీభవన్ ఏఐసీసీ సమావేశ మందిరంలో ఆదివాసి కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఆదివాసి నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ ఎస్టీ డిపార్ట్మెంట్ జాతీయ అధ్యక్షుడు విక్రాంత్ భూరియాను ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక ఆదివాసి కాంగ్రెస్ బస్సు యాత్రపై నాయకులు విస్తృతంగా చర్చించారు. యాత్రను విజయవంతం చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదివాసీలకు చేరవేసే కార్యాచరణపై సమాలోచనలు చేశారు. విక్రాంత్ భూరియా మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ, వారి సామాజిక, ఆర్థిక సాధికారత కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ రామచంద్ర నాయక్, బాలు నాయక్, రాందాస్ నాయక్, డాక్టర్ మురళి నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర, జిల్లా స్థాయి ఆదివాసి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజా ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని, ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మరింత మెరుగైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వైద్య అధికారులను ఆదేశించారు. గురువారం లక్షెట్టిపేట 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. వార్డులు, రిజిస్టర్లు ల్యాబ్, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అధికంగా నమోదవుతున్న వ్యాధులు, అందిస్తున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన మందుల నిల్వలు అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను మండల తహశీల్దార్ దిలీప్ కుమార్తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

- **మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను ధృవీకరించుకోవాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎస్ఐఆర్ కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ శశికల, బీఎల్ఓలు చైర్పర్సన్ నివాసానికి వెళ్లి ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఓటరు జాబితా పారదర్శకత, ఖచ్చితత్వం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఈనెల 25 నుంచి జూలై 24 వరకు కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు తమ ఇళ్లకు వచ్చే బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. కుటుంబ వివరాలు, తల్లిదండ్రులు, తాతల వివరాలు, ప్రస్తుత నివాస చిరునామా వంటి సమాచారాన్ని ఫారాల్లో సక్రమంగా నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ఓటు పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, ఓటరు జాబితా ప్రక్షాళనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇతర రాష్ట్రాల్లో ఈ ప్రక్రియలో పాల్గొనకపోవడంతో కొంత మంది పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించబడిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. జిల్లాలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రతి ఓటరు తమ వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ రోహిత్, బీఎల్ఓల బృందం తదితరులు పాల్గొన్నారు.



# రెండు వరుస హత్యలతో సంచలనం సృష్టించిన కేసులో 12 మంది నిందితుల అరెస్ట్

- **వివరాలు వెల్లడించిన డీఎస్పీ నరేందర్ గౌడ్**



**ఉద్యమ కెరటం, తూప్రాన్,**
వరుస హత్య కేసులో పురోగతి సాధించిన పోలీసులు గురువారం మీడియా సమావేశంలో వివరాలు తెలిపారు.తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం హత్యకు గురైన రావణబోయిన యాదగిరి హత్య కేసును పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.శంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన యటా కిషన్, దిద్దికాడి లింగం, యటా లక్ష్మణ్లను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, యటా శ్రీదర్కు తుపాకుల శోభ కుటుంబంతో ఆటో లావాదేవీల విషయంలో వివాదాలు ఉండటంతో ఇరువర్గాల మధ్య వైరం కొనసాగుతోంది. ఈ నెల 22న శ్రీదర్ అనంతసాగర్ సమీపంలో హత్యకు గురికావడంతో, శోభ సోదరుడు ప్రభు కుటుంబ సభ్యులే కారణమని భావించిన నిందితులు ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారు.అదే రోజు రాత్రి నర్సాపూర్ సర్కిల్ పరిధిలోని గోల్డెన్ హోటల్ వద్ద రావణబోయిన యాదగిరిని గుర్తించిన నిందితులు అతడిని బలవంతంగా ఆటోలో ఎక్కించి కొప్పులపల్లి డ్యాం సమీపానికి తీసుకెళ్లారు. అక్కడ నీ కుమారుడు ప్రభు మా కుమారుడు శ్రీదర్ను హత్య చేశాడు. అంటూ యాదగిరిపై బండరాయితో దాడి చేసి, అనంతరం మెడకు తాడు బిగించి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం మృతదేహాన్ని రాయికి కట్టి డ్యాం నీటిలో పడవేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు.ఈ నెల 24న ఘటనలో ఉపయోగించిన ఆటోను తీసుకు రావడానికి కొప్పులపల్లి డ్యాం వద్దకు వచ్చిన సమయంలో పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చేగుంట మండలం అనంతసాగర్ వద్ద యట శ్రీధర్ ని హత్య చేసిన 9 మంది లో నలుగురు మహిళలు, పురుషులు ఉన్నారు వారి వద్ద నుంచి నేరానికి సంబంధించిన మొబైల్ ఫోన్లను, ఆటో ను స్వాధీనం చేసుకున్నారు.ఈ హత్య కేసును వేగంగా ఛేదించిన తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, రామాయంపేట సీఐ సైదా నాయక్,తో ఎస్ఐ చైతన్య రెడ్డి,శివనందం, గంగరాజ, బాలరాజ్ లతో పాటు పోలీసు సిబ్బందిని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. కేసుకు సంబంధించిన మరింత దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ నరేందర్ తెలిపారు .

# తెలుగువారి కంపెనీల్లో దివీస్ టాప్

హైదరాబాద్, జూన్ 25 : దేశంలోని అత్యంత విలువైన 500 ప్రైవేట్ కంపెనీల తాజా జాబితాలో తెలుగు కంపెనీలు బలమైన ప్రదర్శన కనబరిచాయి. హురున్ ఇండియా--బర్గండీ ప్రైవేట్ సంయుక్తంగా విడుదల చేసిన 2025 రిపోర్ట్‌లో మొత్తం 39 తెలుగు కంపెనీలు చోటు దక్కించుకున్నాయి. ఈ జాబితాలో దివీస్ లేబొరేటరీస్ రూ.1.72 లక్షల కోట్ల విలువతో మొదటి స్థానంలో నిలిచింది. డాక్టర్ రెడ్డీస్ రూ.1.10 లక్షల కోట్లతో రెండో స్థానాన్ని, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (వీజు×ూ) రూ.83,800 కోట్లతో మూడో స్థానాన్ని సాధించాయి. రిపోర్ట్ ప్రకారం, గత ఐదేళ్లలో తెలుగు కంపెనీల మొత్తం విలువ రూ.12.1 లక్షల కోట్లకు పెరిగింది. ఇది 2021తో పోలిస్తే సుమారు 75 శాతం వృద్ధి. అదే సమయంలో కంపెనీల సంఖ్య 30 నుంచి 39కి పెరిగింది. రంగాల వారీగా చూస్తే హెల్త్‌కేర్ రంగం ఆధిపత్యం కొనసాగిస్తోంది. మొత్తం 16 కంపెనీలు ఈ విభాగానికి చెందినవే. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం నుంచి 5 కంపెనీలు, ఇండస్ట్రియల్ ప్రొడక్ట్స్, ఆటోమొబైల్ రంగాల నుంచి 3 చొప్పున సంస్థలు చోటు దక్కించుకున్నాయి.

ఉద్యోగాల పరంగా కూడా ఈ కంపెనీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మొత్తం 3.4 లక్షల మంది వీటిలో పనిచేస్తుండగా, మహిళా ఉద్యోగుల్లో డాక్టర్ రెడ్డీస్ అగ్రస్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ మరోసారి అత్యంత విలువైన కంపెనీగా నిలిచింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.




# భీమ్ పేమెంట్స్ లావాదేవీలు మూడింతలు

హైదరాబాద్, జూన్ 25: ప్రభుత్వ రంగ డిజిటల్ చెల్లింపుల యాప్ భీమ్ పేమెంట్స్ లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. జూన్ 2025 నుంచి మే 2026 మధ్య ఈ యాప్ ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలు మూడింతలు పెరిగినట్లు ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ వెల్లడించింది. గత ఏడాది జూన్‌లో 79.64 మిలియన్ల లావాదేవీలు నమోదవగా, ఈ ఏడాది మే చివరి నాటికి అవి 244 మిలియన్లకు చేరుకున్నట్లు సంస్థ తెలిపింది. మొత్తం లావాదేవీల విలువ రూ.26,952 కోట్లుగా నమోదైనట్లు ఎన్‌బీఎస్‌ఎల్ ఎండీ, సీఈఓ లలితా నటరాజ్ పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో భీమ్ యాప్ వినియోగదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందని సంస్థ వెల్లడించింది. త్వరలోనే క్రెడిట్ కార్డు, డిజిటల్ రుణాలు, ఇతర ఆర్థిక సేవలను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా జరిగిన లావాదేవీలలో తెలంగాణ వాటా 23.9 శాతంగా ఉన్నట్లు సమాచారం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నదానికి ఇది మరో సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు.




# ఎఫ్‌డీ వడ్డీ రేట్లు పెంచిన బంధన్ బ్యాంక్

కోల్‌కతా, జూన్ 25 : బంధన్ బ్యాంక్ తన ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) వడ్డీ రేట్లను పెంచుతూ డిపాజిట్‌దారులకు శుభవార్త అందించింది. ఎంపిక చేసిన కాలపరిమితి డిపాజిట్లపై వడ్డీ రేట్లను గరిష్టంగా 20 బేసిస్ పాయింట్ల వరకు పెంచుతున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. తాజా సవరణల ప్రకారం, రెండు నుంచి మూడు సంవత్సరాల కాలపరిమితి ఉన్న డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు గరిష్టంగా 7.95 శాతం వార్షిక వడ్డీ లభించనుంది. అదే కాలపరిమితిలో ఇతర ఖాతాదారులకు 7.45 శాతం వడ్డీని బ్యాంక్ అందించనుంది. అలాగే ఐదేళ్లలోపు కాలపరిమితి ఉన్న డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం, సాధారణ ఖాతాదారులకు 7.25 శాతం వడ్డీని చెల్లించనున్నట్లు బ్యాంక్ తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా స్థిర ఆదాయం కోరుకునే పెట్టుబడిదారులకు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు మరింత ప్రయోజనం కలగనుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కేవలం 6 నిమిషాల్లోనే

## అమ్ముడైన స్కోడా కోడియాక్ ఆర్ఎస్

ముంబై, జూన్ 25 : భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో లగ్జరీ కార్లకు ఉన్న క్రేజ్ మరోసారి స్పష్టమైంది. ప్రముఖ చెక్ ఆటోమొబైల్ సంస్థ స్కోడా తన కొత్త ప్రీమియం 7-సీటర్ పెర్ఫార్మెన్స్ ఎస్‌యూవీ కోడియాక్ ఆర్ఎస్ కోసం విడుదల చేసిన 50 యూనిట్లు కేవలం ఆరు నిమిషాల్లోనే పూర్తిగా అమ్ముడై కొత్త రికార్డు సృష్టించాయి. ఈ కారుకు సంబంధించిన ధరను ఇంకా అధికారికంగా ప్రకటించకముందే వినియోగదారులు ముందుగా రూ.3 లక్షల టోకెన్ అమౌంట్ చెల్లించి బుకింగ్‌లు చేసుకోవడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. గతంలో స్కోడా ఆక్టేవియా ఆర్ఎస్ మోడల్‌కు వచ్చిన డిమాండ్‌ను కూడా ఈ కొత్త మోడల్ అధిగమించినట్లు తెలుస్తోంది. సాధారణంగా కుటుంబ అవసరాల కోసం ఉపయోగించే 7-సీటర్ ఎస్‌యూవీ అయినప్పటికీ, ఇందులో స్పోర్ట్స్ కార్ స్థాయి పనితీరు ఉండటమే దీనికి భారీ డిమాండ్ రావడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ వాహనం పూర్తిగా విదేశాల్లో తయారై భారత మార్కెట్లోకి దిగుమతి చేయబడిన ప్రీమియం మోడల్. ఈ కారులో 1,984 సీసీ టర్బోచార్జ్డ్ పెట్రోల్ ఇంజన్‌ను అమర్చారు. ఇది 265 బీహెచ్‌పీ శక్తి, 400 ఎన్‌ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. కేవలం 6.3 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవడం దీని ప్రత్యేకత. గరిష్టంగా గంటకు 231 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగల సామర్థ్యం కలిగి ఉంది.మొదటి విడత స్టాక్ తక్కువ సమయంలోనే అమ్ముడవడంతో, రెండో విడత వాహనాలపై కూడా భారీ డిమాండ్ ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



# సుప్రా పసిఫిక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ భారీ విస్తరణ ప్రణాళిక

SUPRA PACIFIC | FINANCIAL SERVICES LIMITED

ముంబై, జూన్ 25 : ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ సుప్రా పసిఫిక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ దేశవ్యాప్తంగా తమ కార్యకలాపాలను విస్తరించేందుకు భారీ ప్రణాళికలను ప్రకటించింది. రాబోయే మూడేళ్ల కాలంలో 15 రాష్ట్రాల్లో 500 కొత్త శాఖలను ఏర్పాటు చేయడంతో పాటు, రూ.2,500 కోట్ల విలువైన నిర్వహణ ఆస్తులను సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ విస్తరణలో భాగంగా ముంబైలోని అంధేరిలో సంస్థ కొత్త కార్పొరేట్ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్మన్ మహేష్ థక్కర్, కంపెనీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి మనోజ్ రవి పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ సంస్థ గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో సేవలు అందిస్తోంది. ఇకపై కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గోవా వంటి రాష్ట్రాల్లో కూడా తమ సేవలను వేగంగా విస్తరించనున్నట్లు సంస్థ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆస్తులు రూ.290 కోట్ల నుంచి రూ.499 కోట్లకు పెరిగి 64.39 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఆర్థిక సమ్మిళితత్వాన్ని పెంచే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో బంగారు రుణాలు, చిన్న వ్యాపార రుణాలను అందించడమే ప్రధాన లక్ష్యమని సంస్థ సీఈఓ తెలిపారు. ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా రాబోయే మూడేళ్లలో ఉద్యోగుల సంఖ్యను 700 నుంచి 2,000కు పైగా పెంచనున్నట్లు కంపెనీ ప్రకటించింది. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరంలో నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్ల పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధుల సమీకరణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# సైబర్ మోసాలకు బ్రేక్

## 5 రోజుల్లో తప్పనిసరి రీఫండ్‌కి ఆర్‌బీఐ ఆదేశాలు

ముంబై, జూన్ 25 : డిజిటల్ చెల్లింపులు, క్రెడిట్ కార్డు వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాలను అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం, డిజిటల్ మోసం లేదా అనధికారిక లావాదేవీలకు గురైన ఖాతాదారులకు బ్యాంకులు గరిష్టంగా ఐదు పనిదినాల్లోపే రీఫండ్ చేయాల్సి ఉంటుంది. ఈ రీఫండ్‌ను “షాడో రివర్సల్” లేదా “తాత్కాలిక క్రెడిట్” రూపంలో బాధితుడి ఖాతా లేదా క్రెడిట్ కార్డులో వెంటనే జమ చేయాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. బ్యాంకు విచారణ పూర్తయ్యే వరకు ఖాతాదారులు తమ సొమ్ము కోసం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఈ విధానం తీసుకొచ్చినట్లు పేర్కొంది. ఇదే కాకుండా, ట్రాన్సాక్షన్ అలర్ట్స్ వ్యవస్థలో కూడా ఆర్‌బీఐ కీలక మార్పులు చేసింది. ఇకపై క్రెడిట్ కార్డు లేదా డిజిటల్ చెల్లింపుల ద్వారా రూ.500 లేదా అంతకంటే ఎక్కువ విలువైన ప్రతి లావాదేవీకి వెంటనే మొబైల్ ఫోన్ మరియు ఈమెయిల్‌కు అలర్ట్ మెసేజ్ రావడం తప్పనిసరి కానుంది. ఈ నూతన నిబంధనలు 2027 జనవరి 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులతో అనధికారిక లావాదేవీలను త్వరగా గుర్తించడం, కార్డులను వెంటనే బ్లాక్ చేయడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంచడమే కాకుండా సైబర్ నేరగాళ్లకు గట్టి అడ్డుకట్ట వేస్తుందని భావిస్తున్నారు.






# బంగారం తగ్గుముఖం

హైదరాబాద్, జూన్ 25: బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి శుభవార్త. దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు వరుసగా రెండో రోజూ తగ్గుదల నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పడిపోవడం, అమెరికా డాలర్ బలపడటం, అలాగే అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై కఠిన వైఖరి కొనసాగవచ్చనే అంచనాలు ఈ తగ్గుదలకు కారణంగా భావిస్తున్నారు. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం గురువారం ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,130 గా నమోదైంది. అలాగే లిలి22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,28,450 గా ఉంది. వెండి ధర కూడా తగ్గుతూ కిలోకు లిలిరూ.2,30,000 వద్ద ట్రేడ్ అవుతోంది. తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఖమ్మం వంటి ప్రధాన నగరాల్లో కూడా ఇదే స్థాయిలో ధరలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లోనూ బంగారం ధరలు సమానంగా నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా చూస్తే చెన్నైలో ధరలు కొంత ఎక్కువగా ఉండగా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు వంటి నగరాల్లో కూడా దాదాపు సమాన స్థాయిలోనే బంగారం ట్రేడ్ అవుతోంది. ఇక న్యూఢిల్లీ, జైపూర్ వంటి నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర స్వల్పంగా ఎక్కువగా ఉంది. మొత్తంగా చూస్తే అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో బంగారం ధరలు తాత్కాలికంగా తగ్గుముఖం పట్టాయని నిపుణులు చెబుతున్నారు. కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది అనుకూల సమయమని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఇంధన ధరల్లో స్థిరత్వం

## వాహనదారులకు ఊరట

హైదరాబాద్, జూన్ 25 : వాహనదారులకు కొంత ఉపశమనం లభించింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఈరోజు ఎలాంటి మార్పు లేదు. ప్రభుత్వ చమురు సంస్థలు ప్రతి రోజు ఉదయం ఇంధన ధరలను సవరిస్తూ ఉంటాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరలు, డాలర్ మారకం విలువ ఆధారంగా దేశవ్యాప్తంగా రేట్లు నిర్ణయించబడతాయి. రవాణా ఖర్చులు, స్థానిక పన్నులు కూడా ప్రతి రాష్ట్రంలో ధరల తేడాలకు కారణమవుతాయి. ప్రస్తుతం తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.69గా ఉండగా, డీజిల్ ధర రూ.103.82గా కొనసాగుతోంది. వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ వంటి నగరాల్లో కూడా దాదాపు ఇదే ధరలు అమల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.25గా ఉండగా, డీజిల్ ధర రూ.105.36గా ఉంది. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి వంటి నగరాల్లో కూడా దాదాపు ఇదే స్థాయి ధరలు కొనసాగుతున్నాయి. ధరల్లో స్థిరత్వం రావడంతో రవాణా రంగం, టాక్సీ, ఆటో యజమానులకు కొంత ఊరట లభించింది. అయితే అంతర్జాతీయ ముడి చమురు ధరల మార్పుల ఆధారంగా భవిష్యత్తులో రేట్లు మారే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

వాహనదారులు ఇంధనం నింపే ముందు తాజా ధరలను తెలుసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఎస్ఎంఎస్ సేవల ద్వారా కూడా సమీప బంక్ ధరలను తెలుసుకునే సౌకర్యం ఉంది.

# నిమిషాల్లో డెలివరీ విస్తరణ..

## అమెజాన్ నౌ సేవలు 300 నగరాలకు

amazon now

హైదరాబాద్, జూన్ 25 : ఈ-కామర్స్ రంగంలో అమెజాన్ మరో కీలక అడుగు వేసింది. దేశవ్యాప్తంగా తన ‘అమెజాన్ నౌ’ నిమిషాల్లో డెలివరీ సేవలను 300 నగరాలకు విస్తరించనున్నట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రతి త్రైమాసికంలో ఆర్డర్లు రెట్టింపు అవుతున్న వేగంతో, అమెజాన్ నౌ భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ-కామర్స్ విభాగంగా మారిందని సంస్థ తెలిపింది. అవసరమైన ఉత్పత్తులను కొన్ని నిమిషాల్లోనే వినియోగదారులకు చేరవేయడమే లక్ష్యంగా తమ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం అమెజాన్ కిరాణా సరుకులు, పండ్లు, కూరగాయలు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, ఫ్యాషన్, బ్యూటీ ఐటమ్స్, గృహోపకరణాలు వంటి వేలాది ఉత్పత్తులను నిమిషాల్లో లేదా గంటల్లో డెలివరీ చేస్తున్నది. అదే రోజు, మరుసటి రోజు డెలివరీ సేవలను కూడా పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. ఈ విస్తరణలో భాగంగా సంస్థ డెలివరీ సిబ్బంది సంక్షేమం కోసం ‘సమ్మాన్’ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యా సహాయం, బీమా కవరేజ్, రహదారి భద్రతా చర్యలు, ప్రభుత్వ ప్రయోజనాల ప్రాప్తి వంటి సౌకర్యాలు అందించనున్నట్లు అమెజాన్ తెలిపింది. అలాగే ‘ఆశ్రయ్’ విశ్రాంతి కేంద్రాలను 250 ప్రాంతాలకు విస్తరించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇవి అన్ని డెలివరీ అసోసియేట్‌లకు అందుబాటులో ఉండనున్నాయి. బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, పుణె, హైదరాబాద్ సహా అనేక మెట్రో నగరాల్లో ఇప్పటికే 5 కోట్లకు పైగా వినియోగదారులకు సేవలు అందుతున్నాయని అమెజాన్ వెల్లడించింది.

# భారత్-ఐర్లాండ్ టీ20 మ్యాచ్ సమయాల్లో మార్పు



**బెల్‌ఫాస్ట్, జూన్ 25 :** భారత్–ఐర్లాండ్ మధ్య జరగనున్న రెండు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల ప్రారంభ సమయాల్లో మార్పు చేసినట్లు క్రికెట్ ఐర్లాండ్ ప్రకటించింది. తొలుత సాయంత్రం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన మ్యాచ్‌లు ఇప్పుడు సాయంత్రం 6 గంటలకే ప్రారంభం కానున్నాయి. జూన్ 28న జరగనున్న రెండో టీ20 మ్యాచ్ సమయం, అదే రోజు మహిళల ప్రపంచకప్‌లో భారత్––ఆస్ట్రేలియా మ్యాచ్‌తో కలిసిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రసార భాగస్వాములతో చర్చల అనంతరం మ్యాచ్ సమయాన్ని ముందుకు మార్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ రెండు మ్యాచ్‌లు బెల్‌ఫాస్ట్‌లోని సివిల్ సర్వీస్ క్రికెట్ క్లబ్ వేదికగా జూన్ 26, 28 తేదీల్లో జరగనున్నాయి. ఈ సిరీస్ ద్వారా శ్రేయస్ అయ్యర్ భారత టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించనుండగా, ఐర్లాండ్ జట్టుకు లోర్కన్ టక్కర్ నాయకత్వం వహించనున్నారు. మ్యాచ్ సమయ మార్పుతో అభిమానులకు రెండు కీలక క్రికెట్ మ్యాచ్‌లను సజావుగా వీక్షించే అవకాశం లభించనుంది.


# కోహ్లీ వన్8 షూస్‌కు భారీ స్పందన

**24 గంటల్లోనే లక్షన్నర జతలు అమ్మకం**

**ముంబై, జూన్ 25 :** టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ మరోసారి తన బ్రాండ్ విలువతో వార్తల్లో నిలిచాడు. ఆయన ప్రారంభించిన 'వన్8' గ్లోబల్ షూ బ్రాండ్ లాంచ్ అయిన కేవలం 24 గంటల్లోనే లక్షన్నర జతలు అమ్ముడై సరికొత్త రికార్డు సృష్టించాయి. ఈ అమ్మకాలతో ఒక్కరోజులోనే రూ.138 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. క్రీడా రంగంలో మాత్రమే కాకుండా వ్యాపార ప్రపంచంలోనూ కోహ్లీకి ఉన్న క్రేజ్ ఈ ఫలితాలతో స్పష్టమవుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ షూస్ ధరను కోహ్లీ టెస్ట్ క్రికెట్‌లో సాధించిన 9,230 పరుగులకు గుర్తుగా రూ.9,230గా నిర్ణయించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రీ–బుకింగ్ ఆధారంగా మాత్రమే అమ్మకాలు జరగడంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. లాంచ్ ఈవెంట్‌లో పాల్గొనడానికి కూడా ప్రత్యేకంగా ప్రీ–బుక్ చేసిన కొనుగోలుదారులకే అవకాశం కల్పించారు. అయినప్పటికీ అభిమానుల నుంచి ఊహించని స్థాయిలో స్పందన



లభించడం గమనార్హం. ఈ విజయంతో కోహ్లీ కేవలం క్రికెటర్‌గా మాత్రమే కాకుండా, గ్లోబల్ స్పోర్ట్స్ బ్రాండ్ ఐకాన్‌గా తన స్థానాన్ని మరింత బలపర్చుకున్నారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



# భారత క్రికెట్ చరిత్రను మార్చిన రోజు

**లండన్, జూన్ 25 :** భారత క్రికెట్ దిశను పూర్తిగా మార్చేసిన చారిత్రాత్మక రోజు జూన్ 25. 1983లో ఇదే రోజున కపిల్ దేవ్ నేతృత్వంలోని టీమిండియా ప్రపంచ క్రికెట్‌ను ఏలుతున్న వెస్టిండీస్‌ను ఓడించి తొలి వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకుంది. లార్డ్స్ మైదానంలో జరిగిన ఆ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, వెస్టిండీస్ పేస్ దాడిని ఎదుర్కోలేక 60 ఓవర్లలో 183 పరుగులకే ఆలౌట్ అయింది. తక్కువ స్కోరు అయినప్పటికీ భారత బౌలర్లు అద్భుత ప్రదర్శన చేసి విండీస్ జట్టును 140 పరుగులకే కుప్పకూల్చారు. దీంతో భారత్ 43 పరుగుల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో కీలక మలుపుగా నిలిచింది వివ్ రిచర్డ్స్ ఇచ్చిన క్యాచ్. కెప్టెన్ కపిల్ దేవ్ వెనక్కి పరుగెత్తుతూ తీసిన ఆ అద్భుత క్యాచ్ మ్యాచ్ గమనాన్నే మార్చేసింది. ఆ వికెట్ తర్వాత వెస్టిండీస్ పతనం ప్రారంభమై చివరకు ఓటమికి దారితీసింది. ఈ విజయంతో భారత్‌లో క్రికెట్ కేవలం ఆటగా కాకుండా ఒక భావోద్వేగంగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు. తరువాతి తరంలో సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాల ఎదుగుదలకు ఈ విజయం స్ఫూర్తిగా నిలిచింది. అంతేకాకుండా భారత క్రికెట్ బోర్డు ప్రపంచ స్థాయిలో శక్తివంతమైన సంస్థగా ఎదగడానికి ఈ రోజు పునాది వేసినట్టుగా భావిస్తారు.

## ఇంగ్లండ్ వన్డే సిరీస్ జట్టుపై

# మంజ్రేకర్ విమర్శలు

**జైస్వాల్ పక్కన పెట్టడంపై చర్చ**



**ముంబై, జూన్ 25 :** ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్ కోసం భారత జట్టును ప్రకటించిన నేపథ్యంలో సెలక్షన్ నిర్ణయాలపై మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యంగా ఫామ్‌లో ఉన్న యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను జట్టులోకి తీసుకోకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. మంజ్రేకర్ మాట్లాడుతూ, జైస్వాల్ తన చివరి మూడు వన్డేల్లో అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ అతనికి అవకాశం ఇవ్వకపోవడం కఠినమైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు. "అలాంటి ఫామ్‌లో ఉన్న ఆటగాడిని పక్కనపెట్టడం అన్యాయం" అని ఆయన వ్యాఖ్యానించారు. అదే సమయంలో కెప్టెన్ రోహిత్ శర్మ ఎంపికపై కూడా ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. స్టార్ ఆటగాళ్ల ప్రాధాన్యత ఆధారంగా కాకుండా, పూర్తిగా ప్రదర్శన ఆధారంగానే జట్టు ఎంపిక జరగాలని అన్నారు. భారత క్రికెట్‌లో పెద్ద పేర్ల ప్రభావం ఎక్కువగా ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. "సెలక్షన్ అనేది వ్యక్తుల కోసం కాకుండా భారత క్రికెట్ భవిష్యత్తు కోసం ఉండాలి" అని మంజ్రేకర్ స్పష్టం చేశారు. రాబోయే ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్ పాత్రపై కూడా స్పష్టత అవసరమని సూచించారు. ఇదే సమయంలో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు.



# మూడేళ్ల తర్వాత బ్రెజిల్ జెర్సీలో నెయ్‌మార్ పునరాగమనం..

**మియామి, జూన్ 25 :** ఫుట్‌బాల్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూసిన క్షణం చివరకు సాకారమైంది. బ్రెజిల్ స్టార్ ఆటగాడు నెయ్‌మార్ దాదాపు మూడేళ్ల (981 రోజులు) విరామం తర్వాత జాతీయ జట్టు జెర్సీని తిరిగి ధరించాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 గ్రూప్–సి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో జరిగిన పోరులో నెయ్‌మార్ 76వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి అడుగుపెట్టాడు. అతను వార్మప్ చేస్తున్న క్షణాల నుంచే స్టేడియంలో అభిమానులు కరతాళ ధ్వనులతో ఉత్సాహం వ్యక్తం చేశారు. 2023 అక్టోబర్‌లో ఉరుగ్వేతో జరిగిన మ్యాచ్‌లో తీవ్రమైన మోకాలి గాయంతో అతను ఆటకు దూరమయ్యాడు. శస్త్రచికిత్స తర్వాత దీర్ఘకాలం విశ్రాంతి తీసుకున్న నెయ్‌మార్, 34 ఏళ్ల వయసులో తిరిగి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి రావడం ప్రత్యేకంగా నిలిచింది. మ్యాచ్ అనంతరం భావోద్వేగానికి లోనైన నెయ్‌మార్ మాట్లాడుతూ, "మూడేళ్ల తర్వాత మళ్లీ జాతీయ జెర్సీ ధరించడం మాటల్లో చెప్పలేని ఆనందం" అని తెలిపాడు. ఆటకు దూరంగా ఉన్న కాలం తనకు మానసికంగా ఎంతో కష్టంగా గడిచిందని ఆయన చెప్పాడు. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ 3–0 తేడాతో ఘన విజయం సాధించగా, వినిసియస్ జూనియర్ రెండు గోల్స్‌తో మెరిశాడు. నెయ్‌మార్ రాక జట్టుకు మరింత ఆత్మవిశ్వాసం ఇచ్చిందని సహచర ఆటగాళ్లు అభిప్రాయపడ్డారు.



# న్యూజిలాండ్‌కు ఎదురుదెబ్బ


నాటింగ్‌హామ్, జూన్ 25: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌కు ముందు న్యూజిలాండ్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. కీలక ఆటగాళ్లు మ్యాట్ హెన్రీ, గ్లెన్ ఫిలిప్స్ గాయాల కారణంగా చివరి టెస్టుకు దూరమయ్యారు. కెన్నింగ్‌టన్ ఓవల్‌లో జరిగిన రెండో టెస్టులో న్యూజిలాండ్ విజయంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించారు. గ్లెన్ ఫిలిప్స్ తొలి ఇన్నింగ్స్‌లో శతకం సాధించగా, మ్యాట్ హెన్రీ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 11 వికెట్లు తీసి ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను కుదేలు చేశాడు. న్యూజిలాండ్ క్రికెట్ తెలిపిన వివరాల ప్రకారం, హెన్రీ ఎడమ కాలి పిక్క కండరంలో స్వల్ప చీలికకు గురయ్యాడు. అతడు కోలుకోవడానికి రెండు నుంచి నాలుగు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు పక్కటెముకల నొప్పితో బాధపడుతున్న గ్లెన్ ఫిలిప్స్ కూడా మూడో టెస్టుకు అందుబాటులో ఉండడని జట్టు యాజమాన్యం వెల్లడించింది. ఇప్పటికే సిరీస్‌ను సమం చేసిన న్యూజిలాండ్, మూడో టెస్టులో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని భావిస్తున్న సమయంలో ఈ ఇద్దరు ఆటగాళ్లు దూరం కావడం జట్టుకు పెద్ద లోటుగా మారింది. వీరి స్థానాల్లో బెన్ సియర్స్, మిచెల్ శాంట్నర్‌లను జట్టులోకి ఎంపిక చేశారు.



## అభిషేక్ పోరెల్‌పై పెళ్లి పేరుతో

# మోసం ఆరోపణలు..

కోల్‌కతా, జూన్ 25 : ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ చుట్టూ వివాదం చోటుచేసుకుంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ ఓ యువతి చేసిన ఆరోపణలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా మొగ్రా పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు తన తల్లితో కలిసి వెళ్లి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తనతో గత మూడేళ్లుగా సంబంధంలో ఉన్న అభిషేక్ పోరెల్, పెళ్లి చేస్తానని నమ్మించి తర్వాత దూరమయ్యాడని ఆమె ఆరోపించింది. అంతేకాక తనపై దాడి చేశాడని కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇక ఈ ఆరోపణలను అభిషేక్ పోరెల్ తీవ్రంగా ఖండించాడు. తన క్రికెట్ కెరీర్‌లో మంచి ఫామ్‌లో ఉన్న సమయంలో కావాలనే తన పేరును వివాదాల్లోకి లాగుతున్నారని ఆయన స్పందించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ వ్యవహారం చట్టపరమైన విచారణ దశలో ఉంది.




# ‘ఎన్బీకే112’ షురూ

**అమరావతి, జూన్ 25:** నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘ఎన్బీకే112’ పూజా కార్యక్రమాలతో అమరావతిలో ఘనంగా ప్రారంభమైంది. నవ్యాంధ్ర రాజధానిలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరై తొలి సన్నివేశానికి క్లాప్ కొట్టారు. బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేయగా, అనంతరం బాలకృష్ణ తన సినిమా డైలాగ్‌తో అభిమానులను అలరించారు. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, నిర్మాత సురేశ్ బాబు సహా సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ అమరావతి ప్రస్తుతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమను విస్తరించాలనే ఉద్దేశంతో ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని అమరావతిలో నిర్వహించినట్లు తెలిపారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ పుట్టిన ఈ నేలపై సినీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అనేక అందమైన చిత్రీకరణ ప్రదేశాలు ఉన్నాయని, అందరి సహకారంతో పరిశ్రమను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు సినిమా షూటింగ్‌లు, ప్రదర్శనలకు మాత్రమే వెళ్లానని, తొలిసారిగా ఓ సినిమా ప్రారంభోత్సవానికి హాజరై క్లాప్ కొట్టానని అన్నారు. తన ముద్దుల మామయ్య బాలకృష్ణ చిత్రానికి క్లాప్ కొట్టడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. బాలకృష్ణ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తామని చెప్పారు. అమరావతి పవిత్ర భూమి అని, భవిష్యత్తులో మరిన్ని సినిమాలు ఇక్కడే ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. సమాచారం ప్రకారం ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుండగా, 2027 వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం ప్రణాళిక రూపొందిస్తోంది. బాలకృష్ణ–కొరటాల శివ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ‘ఇడుపు కాయితం’ ప్రారంభం





విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటుడు ప్రియదర్శి ప్రధాన పాత్రలో, జానపద గాయని నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న ‘ఇడుపు కాయితం’ చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ వాడుక భాషలో ‘ఇడుపు కాయితం’ అంటే ‘విడాకుల పత్రం’ అనే అర్థం. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సుకుమార్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ విడుదల చేశారు. సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్మాత బన్నీవాసు మాట్లాడుతూ మంచి కథకు ప్రాంతీయ హద్దులు ఉండవని మరోసారి ఈ చిత్రం నిరూపిస్తుందని అన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే కథ అని, తెలుగు సినిమా అయినప్పటికీ ఇతర రాష్ట్రాల ప్రేక్షకులను సైతం మెప్పించే అంశాలు ఇందులో ఉన్నాయని తెలిపారు. ప్రతి కుటుంబంలో కనిపించే ఓ సాధారణ సమస్యను ప్రధానాంశంగా తీసుకుని ఈ కథను రూపొందించామని బన్నీవాసు చెప్పారు. పెళ్లైన ప్రతి ఒక్కరూ ఈ చిత్రంలోని భావోద్వేగాలకు అనుసంధానం అవుతారని అన్నారు. కుటుంబ సంబంధాలు, అత్తా కోడళ్ల మధ్య బంధాలను హృద్యంగా చూపించే కథగా ఈ చిత్రం నిలుస్తుందని పేర్కొన్నారు. హీరోయిన్ పాత్ర కోసం నాగదుర్గను సంప్రదించినప్పుడు ఆమె తనకు 15 షరతులు పెట్టిందని బన్నీవాసు వెల్లడించారు. ఆ షరతులు విన్న తర్వాత ఒక తెలుగు అమ్మాయి తన కెరీర్, పాత్రల ఎంపిక విషయంలో ఎంత స్పష్టతతో ఉంటుందో అర్థమైందని చెప్పారు. ఇప్పటికే జానపద గీతాలతో మంచి గుర్తింపు సంపాదించుకున్న నాగదుర్గ ఈ చిత్రంతో వెండితెరకు పరిచయం కానుంది. సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ నుంచి వచ్చిన చిత్రాలు ప్రత్యేక గుర్తింపు పొందాయని, ‘ఇడుపు కాయితం’ కూడా అదే స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ పొందే చిత్రంగా నిలుస్తుందని నిర్మాత తబిత సుకుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. కుటుంబ బంధాలు, భావోద్వేగాలతో కూడిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని చిత్ర బృందం తెలిపింది.

# వెండితెరపైకి వస్తోన్న మిర్జాపూర్




అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించడానికి సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో మూడు సీజన్ల పాటు ఓటీటీ ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు 'మిర్జాపూర్: ది మూవీ' పేరుతో భారీ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో పంకజ్ త్రిపాఠి కాలీన్ భయ్యాగా, అలీ ఫజల్ గుడ్డూ భయ్యాగా, దివ్యేందు మున్నా భయ్యాగా తమ ఐకానిక్ పాత్రల్లో మళ్లీ కనిపించి అభిమానులను అలరించారు. మరోవైపు ఈ చిత్రంలో రవి కిషన్, పంచాయత్ ఫేమ్ జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో ఎంట్రీ ఇస్తూ మరింత ఆసక్తిని పెంచుతున్నారు. రెండు నిమిషాల కంటే ఎక్కువ నిడివి ఉన్న ఈ టీజర్ పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, మరింత భారీ యాక్షన్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సాగింది. ఈ సారి కేవలం మిర్జాపూర్ గద్దె కోసమే కాకుండా అధికారం కోసం కూడా యుద్ధం జరగబోతోందని టీజర్‌తో స్పష్టమవుతుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. కేవలం హిందీలోనే కాకుండా ఇతర భాషలో కూడా థియేటర్లలో విడుదలరాబోతున్నట్లు తెలుస్తుంది.

# లోకేష్ సినిమాలో కొత్త లుక్‌లో బన్నీ




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారిక ప్రకటన వెలువడినప్పటి నుంచే ఈ ప్రాజెక్ట్ సినీ వర్గాలు, అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికర వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ దర్శకుడు అట్లీతో కలిసి ‘రాకా’ చిత్రంలో నటిస్తున్నాడు. భారీ వ్యయంతో, అత్యాధునిక సాంకేతికతతో రూపొందుతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. అయితే ఆ చిత్రంలో కనిపించే లుక్‌కు పూర్తిగా భిన్నంగా లోకేష్ కనగరాజ్ సినిమాలో కనిపించేందుకు అల్లు అర్జున్ సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. లోకేష్ కనగరాజ్ తన చిత్రాల్లో హీరోలను కొత్త కోణంలో చూపించడంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్‌ను కూడా ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని విధంగా తెరపై ఆవిష్కరించేందుకు ఆయన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

### ‘రాకా’ తర్వాత పూర్తి దృష్టి

‘రాకా’ చిత్రం పనులు పూర్తైన వెంటనే లోకేష్ కనగరాజ్ సినిమా కోసం అల్లు అర్జున్ తన రూపురేఖల్లో మార్పులు చేసుకోనున్నట్లు సమాచారం. పాత్రకు అనుగుణంగా ప్రత్యేక మేకోవర్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. అల్లు అర్జున్–లోకేష్ కనగరాజ్ కలయికలో సినిమా వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యాక్షన్, భావోద్వేగాలు, లోకేష్ ప్రత్యేక శైలితో రూపొందనున్న ఈ చిత్రం భవిష్యత్తులో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# అందాల నిధిని వరించని అదృష్టం

అందాల భామ నిధి అగర్వాల్ చివరి చిత్రం రాజాసాబ్. ఈ సినిమా వచ్చి దాదాపు ఆరు నెలలు గడిచినా ఇప్పటి దాకా మరో కొత్త ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించలేదు. హరిహర వీరమల్లు, రాజా సాబ్ తర్వాత పెద్ద పెద్ద ఆఫర్లు వస్తాయని ఆశించిన నిధికి అదృష్టం కలిసి రావడం లేదు. ఆ రెండు చిత్రాలు డిజాస్టర్ కావడంతో అవకాశాలు ఏమో కానీ అమెను పలకరించిన దర్శకనిర్మాతలే లేరు. ఇక లాభం లేదనుకున్న నిధి ప్రస్తుతంబ్రాండ్ ఎండార్స్‌మెంట్స్, కమర్షియల్ ప్రదర్శనలపై దృష్టి పెట్టారు. ఇవే ఆమెకు స్థిరమైన ఆదాయ వనరుగా ఉన్నాయని సమాచారం. నెలకు రూ 5 లక్షలు ఖర్చు నటి జీవితంలో నెలకు వచ్చే ఖర్చుల గురించి ఒక ఇంటర్వ్యూలో నిధి అగర్వాల్ వివరించారు. కనీసం నెలకు రూ 5 లక్షలు ఖర్చవుతాయని తెలిపారు. ఈ ఖర్చులో ప్రయాణం, వసతి, ఫిట్‌నెస్, ఆహారం, మొత్తం జీవనశైలిని నిర్వహించడానికి అయ్యే వ్యయాలు ఉంటాయని చెప్పారు. ఇవి కాకుండా, వ్యక్తిగత సిబ్బందిపై అయ్యే ఖర్చులు అదనంగా ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఒక సెలబ్రిటీగా కనిపించడానికి అవసరమైన ప్రతిదానిపై నిరంతరం ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. బయటకు కనిపించే గ్లామర్ వెనుక ఉన్న వాస్తవాలు ఇవేనని ఆమె అభిప్రాయాన్ని వెల్లడించారు. ఖర్చులు మాత్రం సమానంగా సినీ రంగంలో హీరోలకు ఎక్కువ పారితోషికం లభిస్తుందని, కానీ హీరోయిన్లకు తక్కువే వస్తుందని కూడా ఆమె వెల్లడించారు. అయినప్పటికీ, ఖర్చులు మాత్రం సమానంగానే ఉంటాయని ఆమె పేర్కొన్నారు. నటీమణులు తమ రూపం, ఫిట్‌నెస్, ఇమేజ్‌ను నిలబెట్టుకోవడానికి నిరంతరం పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని చెప్పారు.మొత్తంగా, నిధి అగర్వాల్ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ రంగంలో నటీమణులు ఎదుర్కొనే ఆర్థిక ఒత్తిడిని ప్రతిబింబిస్తున్నాయి. స్థిరమైన ఆదాయం లేకపోయినా, ఖర్చులు మాత్రం నిరంతరం ఉండటం ఒక పెద్ద సవాల్‌గా మారుతుందని ఆమె మాటలు సూచిస్తున్నాయి.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**